Postal Reg No: GNT/52/2023-2025

# భారత్ శక్తి

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక: 106 గుంటూరు, 1-3-2026 , ఆదివారం పేజీలు: 8 వెల: 1.00

## 41బిఎంటి సెల్యులార్ థెరపీ యూనిట్ ను అందుబాటులోకి తెచ్చిన రేనోవా

బంజారాహిల్స్ లోని రేనోవా సెంచరీ హాస్పిటల్ అత్యాధునిక ప్రమాణాలతో కూడిన డిపార్ట్మెంట్ ఆఫ్ బోన్ మారో ట్రాన్స్ ప్లాంట్ అండ్ సెల్యులర్ థెరపీ యూనిట్ ను అందుబాటులోకి తెచ్చింది. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిఎంటి యూనిట్ ను పెద్ది శ్రీధర్ రెడ్డి, డాక్టర్ వేణుబాబులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వస్తున్న అత్యాధునిక వైద్య చికిత్స పద్ధతులను తమ ఆసుపత్రిలో అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు.

## ప్రాజెక్టులు చేపట్టే విషయంలో ఏపీ బెంచ్‌మార్క్ కావాలి: ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి: రాష్ట్రంలో జాతీయ రహదారుల ప్రాజెక్టులపై సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ విస్తరణ, రాష్ట్ర రహదారులు, రోడ్ డెన్సిటీ పెంపు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రంలో చేపట్టిన ఎన్‌హెచ్ ప్రాజెక్టుల పురోగతి, కొత్త రహదారుల నిర్మాణం తదితర అంశాలపై సీఎం సమీక్షించారు. ప్రాజెక్టులు చేపట్టే విషయంలో ఏపీ బెంచ్ మార్క్‌గా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం 2 లేన్లుగా ఉన్న జాతీయ రహదారులను 4 లేన్లుగా మార్చేందుకు ప్రణాళికలు చేపట్టాలని సూచించారు. సమీక్షా సమావేశంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, జాతీయ రహదారుల సంస్థ అధికారులు హాజరయ్యారు.

## చేనేత మగ్గాలకు ఉచిత విద్యుత్తు అమలు.. కూటమి ప్రభుత్వం తీపికబురు



అమరావతి: నేతన్నలకు ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం తీపికబురు అందించింది. చేనేత మగ్గాలకు ఉచిత విద్యుత్ అమలుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఏప్రిల్ 1 నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని నిర్ణయించింది. హ్యాండ్లూమ్ మగ్గానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించనుంది. తద్వారా 93 వేల కుటుంబాలకు లబ్ధి చేకూర్చాలని నిర్ణయించింది. మర మగ్గానికి 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించనుంది. వీటి ద్వారా 10,534 కుటుంబాలకు లబ్ధి చేకూర్చనుంది.

ఎప్పుడూ అండగా ఉంటాం: మంత్రి సవిత

"ఎన్నికల సమయంలో చేనేతలకు అండగా ఉంటామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని నెరవేరుస్తున్నాం. ఎన్నికల సమయంలో హ్యాండ్లూమ్‌లకు 200 యూనిట్లు, పవర్ లూమ్‌కు 500 యూనిట్లు విద్యుత్ ఇస్తామని చెప్పాం. ఇప్పుడు అమలు చేస్తున్నాం. దీంతో చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు ఆర్థిక ఊరట కలుగుతుంది. మగ్గానికి 200 యూనిట్ల చొప్పున నెలకు సుమారుగా రూ.720.. ఏడాదికి రూ. 8,640 ఆదా అవుతుంది. చేనేతలకు 50 ఏళ్లకే 4,000 పెన్షన్ ఇస్తామన్న హామీని అమలు చేశాం" అని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు.

## 'ఇది నిజం.. మహాపాపం' పేరుతో తెదేపా ఫ్లెక్సీలు.. తగులబెట్టిన వైకాపా కార్యకర్తలు




దర్శి: ప్రకాశం జిల్లాలోని దర్శిలో తెదేపా ఫ్లెక్సీలను వైకాపా శ్రేణులు తగలబెట్టడంతో వివాదం రేగింది. 'ఇది నిజం.. మహాపాపం' పేరుతో తెదేపా కార్యకర్తలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. శ్రీవారి ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడినట్లు సిట్ విచారణలో తేలిందంటూ ఫ్లెక్సీలు పెట్టారు. దర్శి పీఎస్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని వైకాపా శ్రేణులు చించి తగులబెట్టాయి. వాటిని తగులబెట్టిన వైకాపా కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## గతంలో అధికారం ఇస్తే ఏం చేశారు జగన్?: వైఎస్ షర్మిల



విజయవాడ: వైకాపా అధినేత జగన్ పాదయాత్ర చేయనున్నట్లు ప్రకటించడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందించారు. అధికారం కోసమే జగన్ పాట్లు అని ఎద్దేవా చేశారు. గతంలో అధికారం ఇస్తే ఏం చేశారని ప్రశ్నించారు. జలయజ్ఞం పూర్తి చేయగలిగారా? నవరత్నాల్లో పెట్టిన హామీలను అమలు చేశారా? మద్యనిషేధం అమలు చేశారా? అని నిలదీశారు. అధికారం ఇస్తే ఒక్క రోజు కూడా బయటకు రాలేదని, ఆ పార్టీ వాళ్లకే అందుబాటులో లేరని విమర్శించారు. ఏడాది తర్వాత చేసే పాదయాత్ర గురించి ఇప్పుడు ఎందుకు ప్రకటన చేశారని ప్రశ్నించారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో షర్మిల మాట్లాడారు.

మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం పరిరక్షణ లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 2 నుంచి యాత్ర చేపట్టనున్నట్లు షర్మిల వెల్లడించారు. అప్పట్లో పథకం ప్రారంభమైన శింగనమల నియోజకవర్గం బండ్లపల్లి నుంచి మళ్లీ యాత్రను ప్రారంభిస్తున్నామని చెప్పారు. తానే స్వయంగా అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని తెలిపారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం కొనసాగించాలని, కూలీల రోజువారీ వేతనాన్ని రూ.400కు పెంచాలని డిమాండ్ చేశారు.

## కల్తీ నెయ్యిపై అసెంబ్లీలో జగన్ చర్చకు రావాలి: మంత్రి కొల్లు రవీంద్ర



అమరావతి: కల్తీ నెయ్యిపై అసెంబ్లీలో చర్చకు వైకాపా సభ్యులతో కలిసి జగన్ రావాలని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గత ఐదేళ్లలో శ్రీవారి ప్రసాదం కల్తీ చేసే అపవిత్ర కార్యానికి జగన్ తెరలేపారని విమర్శించారు. "దేవుడిపై నమ్మకం లేకే దోపిడీ కోసం నిబంధనలు సడలించారు. డెయిరీలకు భారీ ఆర్డర్లు ఇచ్చి హవాలా ముడుపులు అందుకున్నారు. లడ్డూకు వాడిన నకిలీ పదార్థాల్లో రసాయనాలు వెలుగు చూశాయి. పూర్తి నివేదిక వచ్చాక మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయి" అని మంత్రి కొల్లు అన్నారు.

వైకాపా నేతలకు భారీగా ముడుపులు: ప్రభుత్వ విప్ కాలవ

"జగన్ ఐదేళ్ల పాలనలో ఎన్నో పాపాలు జరిగాయి. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది శ్రీవారి భక్తుల విశ్వాసాలకు విఘాతం కలిగింది. ఆధ్యాత్మిక చింతన, దైవభక్తి లేని కరుణాకర్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి లాంటి వారిని ఛైర్మన్‌లుగా నియమించి భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. పవిత్రమైన తిరుమల లడ్డూను కల్తీ నెయ్యితో నాసిరకంగా తయారు చేశారు. వైకాపా నేతలకు పెద్ద ఎత్తున హవాలా సొమ్ము అందింది. తిరుమలలో నెయ్యి కల్తీ బాధ్యులను కఠినంగా దండించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా" అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెల్లడించారు.


వైకాపా నాయకుల్లో భయం: ఆదిరెడ్డి శ్రీనివాస్

"శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జరిగిన తప్పిదాలను మా కూటమి ప్రభుత్వం బయటకు తీసుకొస్తున్న కొద్దీ వైకాపా నేతలకు భయం పట్టుకుంది. లడ్డూ ప్రసాదంలో వైకాపా నేతలు అపచారం చేశారు కాబట్టే గత ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయారు. స్వామివారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని దేశ అత్యున్నత న్యాయస్థానం ఏర్పాటు చేసిన సిట్ విచారణలో తేలింది. ఐదేళ్ల వైకాపా పాలనలో లడ్డూ ప్రసాదంలో కల్తీ చేయడం వల్ల అక్రమంగా రూ.250 కోట్ల వరకూ ఆర్జించారు. చిరు ఉద్యోగి అయిన చిన్న అప్పన్న ఖాతాలో రూ. 4.69 లక్షలు ఎందుకు జమ అయ్యాయి? 20 కోట్ల లడ్డూల్లో జరిగిన అవినీతి గురించి మాట్లాడకపోతే దేని గురించి మాట్లాడాలి?" అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రశ్నించారు.

వారికి బాగా తెలుసు: మాజీ ఎమ్మెల్యే వర్మ

"పాలతో పనిలేకుండా రసాయనాలు ఉపయోగించి నెయ్యి ఎలా తయారు చేయవచ్చో వైకాపా నేతలకు బాగా తెలుసు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించేలా, భక్తుల విశ్వాసాలు దెబ్బతీసేలా వ్యవహరించినవారికి శిక్ష పడాలి. తొలి నుంచీ వైకాపా నేతల నేర ప్రవృత్తి భిన్నంగా ఉండేది. కోడికత్తి, గులకరాయి, గుండెపోటు, గొడ్డలివేటు, పరకామణి దొంగతనం సహా వారే చేసి.. తెదేపాపై నెట్టేయాలని ప్రయత్నాలు చేశారు. వైకాపా అక్రమాలను ప్రజల ముందు పెట్టాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నాం" అని మాజీ ఎమ్మెల్యే వర్మ తెలిపారు.

## పట్టపగలే ఇంట్లో చోరీ.. 14 తులాల బంగారం మాయం



కర్నూలు టౌన్: తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. ఈ ఘటన గురువారం కర్నూలు జిల్లా సంతోష్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్‌కు చెందిన లక్ష్మీదేవి ఇంటికి తాళం వేసి తన కుమార్తెతో పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. పనులు ముగించుకొని ఇంటికి తిరిగి రాగా తాళం పగులగొట్టి ఉంది. గమనించిన తల్లీకుమార్తె ఇంట్లోకి వెళ్లగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వారిని తోసేసి పరారయ్యారు. ఈ క్రమంలో లక్ష్మీదేవికి గాయాలయ్యాయి. 14 తులాల బంగారం చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనపై నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భారత శక్తి
VOICE OF INDIA

# ప్రపంచాన్ని కుదిపేస్తున్న ఎప్ స్టీన్ ఫైల్స్

జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారులు, రాజకీయ నాయకులు, దేశాల అధ్యక్షులు, కంపెనీల అధినేతలు వణికిపోతున్నారు. ఎప్‌స్టీన్ కేసు మళ్లీ ప్రపంచాన్ని కుదిపేస్తోంది. గతంలోనే అంతర్జాతీయంగా పెద్ద చర్చకు దారితీసిన ఈ వ్యవహారం.. ఇప్పుడు కొత్తగా వెలుగులోకి వస్తున్న ఫైల్స్‌తో మరోసారి ప్రభావం చూపుతోంది. ప్రముఖ వ్యాపార, విద్యా, రాజకీయ రంగాలకు చెందిన వ్యక్తుల పేర్లు బయటకు రావడం, ఆ తర్వాత రాజీనామాల పరంపర మొదలవడం.. ఇది సాధారణ పరిణామం కాదు. ప్రపంచ స్థాయి సంస్థల విశ్వసనీయత, నైతిక ప్రమాణాలపై గంభీరమైన ప్రశ్నలను లేవనెత్తే పరిణామంగా ఇది మారింది. ఈ సందర్భంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూ ఈ ఎఫ్) సీఈవో బోర్జ్ బ్రెండే రాజీనామా అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచ ఆర్థిక విధానాలను ప్రభావితం చేసే ప్రముఖ వేదికకు నాయకత్వం వహిస్తున్న వ్యక్తి.. ఇలాంటి ఆరోపణల నడుమ తప్పుకోవడం సంస్థపై నేరుగా ప్రభావం చూపే అంశం. అమెరికా న్యాయ శాఖ విడుదల చేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బ్రెండే పేరు ప్రస్తావించబడడం.. ఆయన ఎప్‌స్టీన్‌తో భేటీ అయినట్లు ఆధారాలు బయటపడడం ఈ పరిణామానికి కారణమయ్యాయి. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలోనే ఆయన రాజీనామా చేయడం.. నైతిక బాధ్యతగా భావించవచ్చు. అయితే తన రాజీనామా లేఖలో ఈ అంశాన్ని నేరుగా ప్రస్తావించకపోవడం సందేహాలకు తావిస్తోంది. ఇది కేవలం ఒక వ్యక్తి రాజీనామా కథ కాదు. హార్వర్డ్ మాజీ అధ్యక్షుడు లారెన్స్ సమ్మర్స్, నోబెల్ గ్రహీత రిచర్డ్ ఆక్సెల్, గోల్డ్‌మన్ శాక్స్ లీగల్ ఆఫీసర్ క్యాథీ రూమ్లెర్, హయత్ హోటల్స్ వారసుడు థామస్ ప్రిట్జ్కర్, డీపీ వరల్డ్ ఛైర్మన్ సుల్తాన్ అహ్మద్ , నార్వే అంబాసిడర్ మోనా వంటి ప్రముఖులు కూడా ఈ వివాదంతో తమ పదవులను వదులుకోవడం.. ఈ వ్యవహారం ఎంత విస్తృతంగా ఉందో తెలియజేస్తోంది. వ్యాపార దిగ్గజాలు, విద్యావేత్తలు, ప్రభుత్వ అధికారుల వరకు విస్తరించిన ఈ సంబంధాల నెట్‌వర్క్, అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకు కారణమవుతోంద ఈ పరిణామాల వల్ల ప్రధానంగా మూడు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. మొదటిది ప్రపంచ ఎలైట్ వర్గాల మధ్య ఉన్న సంబంధాల స్వభావం. రెండవది నైతిక బాధ్యత అనే అంశం. మూడవది సంస్థల పారదర్శకతపై ఉన్న నమ్మకం. ఎవరైనా చట్టపరంగా తప్పు చేశారనే విషయం నిరూపించబడకపోయినా.. ప్రజా విశ్వాసాన్ని కాపాడుకోవడానికి నాయకులు రాజీనామా చేయాల్సిన పరిస్థితి రావడం.. నేటి ప్రపంచంలో నైతిక ప్రమాణాలు ఎంత కీలకమో చూపిస్తోంది. ప్రత్యేకంగా వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వంటి సంస్థల విషయంలో ఈ అంశం మరింత ప్రాముఖ్యం సంతరించుకుంటుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకునే వేదికగా ఉన్న ఈ సంస్థపై ప్రజలకు నమ్మకం ఉండాలి. అందుకే ఏ చిన్న వివాదం కూడా పెద్ద ప్రభావం చూపే అవకాశం ఉంది. బ్రెండే స్థానంలో తాత్కాలికంగా అలోయిస్ జ్వింగీ బాధ్యతలు చేపట్టడం, సంస్థ కొనసాగింపుకు అవసరమైన చర్యగా కనిపిస్తున్నా, దీర్ఘకాలికంగా సంస్థ ప్రతిష్టను పునరుద్ధరించడం పెద్ద సవాలుగా మారింది. అదే సమయంలో ఈ ఫైల్స్ విడుదలలో పారదర్శకత ఎంత వరకు ఉందనే ప్రశ్న కూడా లేవనెత్తబడుతోంది. దర్యాప్తు వివరాలు పూర్తిగా బయటకు రాకపోవడం.. సమాచారం గోప్యంగా ఉంచడం ఇవి మరోవైపు అనుమానాలను పెంచే అంశాలు. ప్రజలకు పూర్తి నిజాలు తెలియజేయకపోతే, ఊహాగానాలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. మొత్తం మీద ఎప్‌స్టీన్ ఫైల్స్ వ్యవహారం ఒక వ్యక్తి లేదా కొన్ని రాజీనామాలకే పరిమితం కాదు. ఇది ప్రపంచ ఎలైట్ వ్యవస్థలో ఉన్న బలహీనతలను బహిర్గతం చేస్తున్న సంఘటనగా చూడాలి. సంస్థల విశ్వసనీయత, నాయకుల నైతిక బాధ్యత, పారదర్శకత ఈ మూడు అంశాలు భవిష్యత్తులో మరింత కఠినంగా పరీక్షించబడే అవకాశం ఉంది. ఈ పరిణామాలు గ్లోబల్ స్థాయిలో పరిపాలనా విధానాలపై, నాయకత్వ ప్రమాణాలపై కొత్త చర్చలకు దారి తీస్తున్నాయి.ఎప్పుడు ఎవరి బాగోతం బయట పడుతుందో అర్థం కాని పరిస్థితి. ఇప్పటికే మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ ఇప్పటికే తప్పు అంగీకరించాడు. ఇక డొనాల్డ్ ట్రంప్ కూడా ఇందులో ఉన్నాడు. అయితే తాజాగా బయటపడిన ఈ ఫైల్స్ కారణంగా పలు కంపెనీల దిగ్గజాలు కూడా ఉన్నారు. వీరు రాజీనామా బాట పడుతున్నారు. తాజాగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సీఈవో బోర్జ్ బ్రెండే తన పదవికి రాజీనామా చేశారు, దవోస్ సమ్మిట్‌ల సంస్థకు ఇది భారీ దెబ్బ. హార్వర్డ్ యూనివర్సిటీ మాజీ అధ్యక్షుడు లారెన్స్ సమ్మర్స్, నోబెల్ బహుమతి విజేత రిచర్డ్ ఆక్సెల్ కూడా బాధ్యతల నుంచి వైదొలిగారు. ఈ ముగ్గురూ ఎప్‌స్టీన్ ఈవెంట్స్‌లో పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.వాల్ స్ట్రీట్ జెయింట్ గోల్డ్‌మన్ సాక్స్‌లో చట్టపరమైన విభాగం హెడ్ క్యాథీ రూమ్లెర్, హయాత్ హోటల్స్ వారసుడు థామస్ ప్రిట్జ్కర్ తమ స్థానాలు వదులుకున్నారు. గ్లోబల్ పోర్ట్ ఆపరేటర్ డీపీ వరల్డ్ ఛైర్మన్ సుల్తాన్ అహ్మద్ బిన్ సులాయెం, నార్వే అంబాసిడర్ మోనా జుహోనీ కూడా రాజీనామా చేశారు. ఈ లిస్ట్ రోజుకొకకొనసాగుతోంది, ఫైనాన్షియల్ మార్కెట్లలో అనిశ్చితి పెరుగుతోంది.ఎప్‌స్టీన్ డాక్యుమెంట్స్‌లో 170+ ప్రముఖుల పేర్లు వచ్చాయి. ఇందులో పాలిటీషియన్లు, బిజినెస్ టైకూన్లు, సైంటిస్టులు ఉన్నారు. ఈ ఆరోపణలు సెక్సువల్ ట్రాఫికింగ్, ఇన్ఫ్లుయెన్స్ ఫెడ్లింగ్‌కు సంబంధించినవి. ఫైనల్ కోర్ట్ ఆర్డర్‌తో ఈ ఫైల్స్ పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చాయి, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఈ రాజీనామాలు చటమనీనీ ఉద్యమం తర్వాత ఎలైట్ అకౌంటబిలిటీకి కొత్త ఎపాక్‌ను ప్రారంభిస్తున్నాయి. డబ్ల్యూఈఎఫ్ విశ్వసనీయత క్షీణించడంతో గ్లోబల్ పాలసీ చర్చలు ప్రభావితమవుతాయి. హార్వర్డ్‌లో నాయకత్వ షేకప్ విద్యా రంగంలో పరిణామాలకు దారితీస్తుంది. ఫైనాన్షియల్ రంగంలో గోల్డ్‌మన్ సాక్స్ షేర్లు 5 శాతం పడిపోయాయి, మార్కెట్ అనిశ్చితి పెరిగింది.

# మండలిలో మంటలు

విజయవాడ, ఫిబ్రవరి 28, ఏపీలో మండలి సమావేశాలు ఇంట్రెస్టింగ్‌గా నడుస్తున్నాయి. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అయినా..ఇప్పుడు కూటమి పవర్‌లో ఉండగా..మండలిలో మాత్రమే చర్చ జరుగుతుండటం ఆసక్తికరంగా మారింది. 2020లో మండలిలో టీడీపీ బలంగా ఉండేది. అప్పుడు అసెంబ్లీలో వైసీపీకి 151 సీట్లు ఉండటంతో వార్ వన్ సైడ్ అన్నట్లుగా సమావేశాలు నడిచాయి. టీడీపీ సభకు వెళ్లినా గొడవ జరగడం, వాకౌట్‌లు అంటూ నిరసన వ్యక్తం చేయడం నడిచేవి. దీంతో సంఖ్యాపరంగా అప్పుడు వైసీపీ అసెంబ్లీలో బలంగా ఉండటంతో వారిదే అప్పర్ హ్యాండ్‌గా ఉండేది.అదే సమయంలో మండలిలో మాత్రం అప్పుడు టీడీపీ బలంగా ఉంటూ పోరాడుతూ వచ్చింది. అప్పుడు టీడీపీకి మండలిలో ఎమ్మెల్సీల బలం ఉండటంతో పాటు ఛైర్మన్ కూడా ఆ పార్టీ నియమించిన వ్యక్తి ఉండటంతో..పెద్దల సభలో వైసీపీ దూకుడును అడ్డుకోగలిగింది. అమరావతి బిల్లును వైసీపీ ప్రభుత్వం అసెంబ్లీలో పాస్ చేసినా..మండలికి వచ్చేసరికి టీడీపీ బ్రేకులు వేయడంతో ఆగిపోయింది. దీంతో ఒకానొక సమయంలో అప్పటి వైసీపీ సర్కార్ మండలిని రద్దు చేసే ఆలోచన కూడా చేసింది.ఇప్పుడు సీన్ మారింది. సీట్లు కూడా మారాయి. విపక్షంలో ఉన్న వైసీపీ అసెంబ్లీకి వెళ్లడం లేదు. మండలిలో మాత్రం తమకున్న బలంతో స్ట్రాంగ్ వాయిస్ వినిపించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో అసెంబ్లీలో 164 సీట్లతో బలంగా ఉన్న కూటమి అక్కడ తమ వాయిస్‌ను వినిపిస్తూ, వైసీపీ తప్పులను ఎత్తిచూపుతోంది. మండలిలో వైసీపీ బలంగా ఉండటంతో..కూటమి సర్కార్ ఏం చేసినా అడ్డుకుంటుండంతో కూటమికి అక్కడ సవాల్‌గా మారింది. కల్తీ నెయ్యిపై చర్చ సందర్భంగా..రచ్చ రచ్చ అయింది. కల్తీ నెయ్యి అంశంపై షార్ట్ డిస్కషన్‌కు ఛైర్మన్ మోషేన్ రాజు అనుమతించారు. వైసీపీ సభ్యుడు పి.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడేందుకు అవకాశమిచ్చారు. అయితే స్వల్పకాలిక చర్చ కోసం వైసీపీ నోటీసు ఇవ్వకపోయినా..ఆ పార్టీ సభ్యుడికి మాట్లాడే అవకాశమిచ్చారంటూ టీడీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిందిసేమ్‌టైమ్ దేవాదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి కల్తీ నెయ్యి అంశంపై ప్రకటన చేసేందుకు లేచి నిలబడ్డారు. అయినా మండలి ఛైర్మన్..వైసీపీ సభ్యుడికే లఘు చర్చను ప్రారంభించే అవకాశం ఇచ్చారంటూ టీడీపీ మరోసారి అబ్జక్షన్స్ వ్యక్తం చేసింది. ఈ సమయంలో మంత్రి పయ్యావుల కేశవ్, మండలి ఛైర్మన్ మోషేన్ రాజు మధ్య తీవ్ర వాదనలు జరిగాయి. వైసీపీ ఇవ్వని నోటీసును ఇచ్చినట్లుగా భావించి లఘు చర్చకు అనుమతించడమే కాకుండా, ప్రభుత్వం తరఫున ప్రకటనకు నిరాకరించడం సరైంది కాదంటూ..టీడీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వాదోపవాదాలు, అధికార-విపక్ష సభ్యుల ఆందోళనలతో మండలిలో గందరగోళం ఏర్పడింది. చర్చ జరగకుండానే సభ వాయిదా పడింది.అయితే ఇప్పుడు మండలిలో వైసీపీకి మెజార్టీ ఉంది. పైగా మండలి ఛైర్మన్ మోషేన్ రాజు కూడా వైసీపీ హయాంలో నియమించబడ్డారు. దీంతో పెద్దల సభలో ఆ పార్టీ అప్పర్ హ్యాండ్ సాధించే ప్రయత్నం చేస్తుందన్న చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే షార్ట్ డిస్కషన్‌పై నిబంధనలు పక్కన పెట్టి మండలి ఛైర్మన్ వ్యవహరించారని టీడీపీ ఆరోపిస్తుంది. మోషేన్ రాజు మాత్రం..అధికార పక్షం అలిగేషన్స్‌ను తప్పుబడుతున్నారు. నోటీస్ విషయంలో పక్కదారి పట్టించేలా మాట్లాడటం సరికాదంటున్నారు. దీంతో మండలిలో కూటమి వర్సెస్ వైసీపీ ఫైట్ ఆసక్తికరంగా మారింది.మరోవైపు మండలిలో అప్పర్ హ్యాండ్ సాధించేందుకు కూటమి ప్లాన్స్ చేస్తుంది. ఇప్పటికే ఆరుగురు వైసీపీ ఎమ్మెల్సీలు కూటమి పార్టీల్లో చేరారు. ఇందులో ఐదుగురు రాజీనామా చేయగా..స్పీకర్ వారికి నోటీసులు ఇచ్చి వివరణ తీసుకుంటున్నారు. ఈ ఐదుగురి రాజీనామాలను మండలి ఛైర్మన్ ఆమోదిస్తే..ఆ సీట్లు కూటమి ఖాతాలోకి వెళ్లనున్నాయి. అప్పుడు మండలిలో కూటమి బలం పెరగనుంది. తర్వాత మరికొంతమంది వైసీపీ ఎమ్మెల్సీలను కూడా ఫ్యాన్ స్విచ్చాఫ్ చేసి కూటమి గూటికి చేరేందుకు రెడీగా ఉన్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. సేమ్‌టైమ్ కొందరు ఎమ్మెల్సీల పదవీకాలం కూడా ముగియనుంది. ఈ సీట్లు కూడా కూటమినే కైవసం చేసుకోనుంది. ఏదైనా మండలిలో జరుగుతున్న ఫైట్..పొలిటికల్ హాట్ టాపిక్‌గా..పబ్లిక్ అటెన్షన్‌ను గ్రాబ్ చేసేలా ఉందనడంలో డౌటే లేదు.

# ప్రకాశంలో ఐరన్ ఓర్ నిల్వలు

ఒంగోలు, ఫిబ్రవరి28,

ఏపీలోని ప్రకాశం జిల్లాలో ఇనుప ఖనిజం నిల్వలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. మాగ్నటైట్ నిల్వలు ఉన్నట్లు ప్రాథమికంగా తేలటంతో.. జియోలాజికల్ టీమ్స్ రంగంలోకి దిగాయి. మాగ్నటైట్ నిల్వలు ఎంతమేరకు ఉన్నాయనే దానిపై డ్రిల్లింగ్ పనులు చేపట్టాయి. ప్రాథమిక అంచనా మేరకు ప్రకాశం జిల్లాలో భారీగా ఇనుప ఖనిజం నిల్వలు ఉన్నట్లు తేలితే.. ఏపీ మైనింగ్ రంగానికి ఓ బిగ్ బూస్ట్ కానుందని అధికారులు చెప్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో ఇనుప ఖనిజం నిక్షేపాలు ఉన్నట్లు ప్రాథమిక అధ్యయనాలు వెల్లడించాయి. భూ ఉపరితలం కిందిభాగంలో మాగ్నటైట్ నిల్వలు గణనీయమైన స్థాయిలో ఉన్నట్లు ప్రాథమిక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మాగ్నటైట్ ఖనిజం పరిధి, లోతు, నాణ్యతను అంచనా వేయడానికి జియోలాజికల్ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించాయి. ప్రకాశం జిల్లాలోని ఎంపిక చేసిన మండలాల్లో డ్రిల్లింగ్ కార్యకలాపాలను నిర్వహించాయి. ప్రకాశం జిల్లాలో సేకరించిన మాగ్నెటైట్ నమూనాలలో ఇనుము 18 నుంచి 25 శాతం వరకు ఉందని నిపుణులు తెలిపారు. సాధారణంగా దీనిని లోగ్రేడ్ ఐరన్ ఓర్‌గా పిలుస్తుంటారు. అయితే ప్రాసెసింగ్ చేసిన తర్వాత పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడుతుందని నిపుణులు చెప్తున్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం ప్రకాశం జిల్లాలో సుమారుగా 800 మిలియన్ టన్నుల మాగ్నటైట్ నిల్వలు ఉన్నట్లు అంచనా.అయితే ఎంత మొత్తంలో మాగ్నటైట్ నిల్వలు ఉన్నాయి, వాణిజ్య పరమైన ఉపయోగాలు వంటి అంశాలపై మరింత స్పష్టత కోసం జియోలాజికల్ మ్యాపింగ్, ఫీజబులిటీ అధ్యయనాలు జరుగుతున్నాయి. ప్రాథమిక అంచనాలు నిజమై ప్రకాశం జిల్లాలో గణనీయమైన స్థాయిలో మాగ్నటైట్ నిల్వలు ఉన్నట్లు తేలితే ప్రకాశం జిల్లా ఏపీ ఖనిజ రంగానికి గణనీయమైన సహాయకారిగా మారుతుందని అధికారులు చెప్తున్నారు. మరోవైపు మాగ్నటైట్ అన్వేషణ కోసం ప్రైవేట్ ఉక్కు దిగ్గజం ఏూచి స్టీల్ బిడ్ గెలుచుకుంది. పైలట్ స్టడీ కింద ఈ ప్రక్రియను వేగవంతం చేసింది. మరోవైపు ఖనిజాలను ముడి పదార్థం రూపంలో ఎగుమతి చేయబోమని అధికారులు చెప్తున్నారు.ధాతువును శుద్ధి చేయడానికి, మలినాలను తొలగించడానికి, ఇనుము శాతాన్ని పెంచడంతో పాటుగా లోగ్రేడ్ మాగ్నటైట్‌ను ఉక్కు తయారీకి అనువైన హైగ్రేడ్ పదార్థంగా మార్చడానికి జిల్లాలో బెనిఫిషియేషన్ ప్లాంట్ ప్రతిపాదించినట్లు తెలిపారు. దీనివలన ఆర్థికపరమైన కార్యకలాపాలు పెరగటంతో పాటుగా స్థానిక యువతకు ఉపాధి కలుగుతుందని అధికారులు చెప్తున్నారు.మరోవైపు ఈ ప్రాజెక్ట్ అమలులోకి వచ్చిన తర్వాత రవాణా, ప్రాసెసింగ్ సౌకర్యాలతో సహా మౌలిక సదుపాయాల అభివృద్ధి ఊపందుకుంటుందని వెల్లడించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ఇంకా ఖనిజాన్ని కనుగొనే దశలోనే ఉందని.. మైనింగ్‌కు ముందు అనుమతులు, పర్యావరణ అధ్యయనాలు, ప్రజా సంప్రదింపులు ఉంటాయని అధికారులు వెల్లడించారు

# మార్చి 1 నుంచి మండే ఎండలు

విశాఖపట్టణం, ఫిబ్రవరి 28,

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో మూడ్రోజుల నుంచి పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షాలు కురుస్తున్నాయి. దక్షిణ అంతర్గత కర్ణాటక ప్రాంతం నుంచి మహారాష్ట్రలోని మాత్వాడా వరకు వ్యాపించి ఉన్న ద్రోణి వాయువ్య దిశగా కదులుతుంది. దీని ప్రభావంతో శుక్రవారం సంగారెడ్డి, రంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీంతో ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ణి ప్రభావంతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉండి, కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో 4.36 సెంటీమీటర్ల మేర అత్యధిక వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లా గూడూరులో అత్యల్పంగా 1.38 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక సిద్దిపేట, వికారాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, జయశంకర్ భూపాలపల్లి వంటి పలు జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఈ అకాల వర్షాలకు రైతులు దారుణంగా నష్టపోతున్నారు. పలు జిల్లాల్లో మొక్కజొన్న, శనగ, జొన్న పంటలు నేలకొరిగాయి. గింజ పాలు పోసుకునే దశలో మొక్కజొన్న నేలవాలడంతో ఎదుగుదల కష్టమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెబుతున్నారు. పలు ప్రాంతాల్లో శుద్ధి చేసి ఆరబెట్టిన పసుపు గాలివానకు తడిసిపోయింది. శనివారం నుంచి వాతావరణం సాధారణ స్థితికి చేరుకునే అవకాశం ఉంది.

# ఏపీలో క్యాస్ట్ పాలిట్రిక్స్

కాకినాడ, ఫిబ్రవరి 28

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా మతపరమైన అంశాలు చర్చకు వస్తున్నాయి. అభివృద్ధి, సంక్షేమం చుట్టూ తిరిగే రాజకీయాలు ఇప్పుడు విశ్వాసాలు, సంప్రదాయాల వైపు వెళ్తున్నాయి. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేనాని పవన్ కల్యాణ్ అనుసరిస్తున్న ప్రస్తుత వ్యూహాలపై రాజకీయ వర్గాల్లో ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. ఎందుకంటే గతంలో వీరి పాలసీ ఇలా ?ండేది కాదు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి అన్ని వర్గాలను సమదృష్టితో చూసే లౌకిక విధానాన్నే అనుసరించింది. గతంలో బీజేపీతో పొత్తులో ఉన్న సమయంలో కూడా చంద్రబాబు నాయుడు మతపరమైన వివాదాలకు దూరంగా ఉండేవారు. అయితే ఇటీవలి కాలంలో ఆయన తీరులో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ముఖ్యంగా తిరుమల లడ్డూ వివాదం, ఆలయాల నిర్వహణ వంటి అంశాల్లో ఆయన తీసుకుంటున్న స్టాండ్ కమ్యూనల్ పాలిటిక్స్ కు దారితీస్తోందని ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు. పవన్ కల్యాణ్ సైతం సనాతన ధర్మ పరిరక్షణ పేరుతో చేస్తున్న వ్యాఖ్యానాలు ఈ విమర్శలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. మెజారిటీ వర్గమైన హిందువుల ఓట్లను ఏకీకృతం చేయడమే లక్ష్యంగా వీరు అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.తమపై వస్తున్న మత రాజకీయాల విమర్శలను కూటమి నేతలు ఖండిస్తున్నారు. తాము ఏ మతానికి లేదా వర్గానికి వ్యతిరేకం కాదని, కేవలం హిందూ మత విశ్వాసాలను దెబ్బతీసే వ్యక్తులను, వ్యవస్థలను మాత్రమే ప్రశ్నిస్తున్నామని వారు వాదిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో హిందూ దేవాలయాల పై జరిగిన దాడులు, అపచారాల విషయంలో జగన్మోహన్ రెడ్డి మౌనం వహించడమే తమ ఆగ్రహానికి కారణమని వారు చెబుతున్నారు. భక్తి భావం ఉన్న ఏ వ్యక్తికైనా తమ మతాచారాలు కలుషితం అవుతుంటే స్పందించే హక్కు ఉంటుందని, దీనిని రాజకీయంగా చూడటం సరికాదని వారు అభిప్రాయపడుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో క్రైస్తవ సామాజిక వర్గం మొదటి నుండి వైఎస్ కుటుంబానికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. జగన్మోహన్ రెడ్డి తన వ్యక్తిగత విశ్వాసాల కారణంగా ఆ వర్గంలో బలమైన పట్టు సాధించారు. ప్రస్తుతం కూటమి నేతలు చేస్తున్న వ్యాఖ్యానాలు జగన్ ను వ్యక్తిగతంగా టార్గెట్ చేసేలా ఉండటంతో, అది తమ మతంపై దాడిగా క్రైస్తవ వర్గాలు భావించే ప్రమాదం ఉంది. చంద్రబాబు నాయుడు ఏ మతాన్నీ విమర్శించకపోయినా, ఆయన వేస్తున్న నిందలు జగన్ క్రైస్తవ మూలాలను తట్టిలేపేలా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. దీనివల్ల ఆ ఓటు బ్యాంకు మరింత గట్టిగా జగన్ వైపునకు మళ్లే అవకాశం ఉంది. క్రైస్తవ ఓటు బ్యాంకును పూర్తిగా జగన్ కు వదిలేయడం చంద్రబాబుకు ఇష్టం లేదు. గతంలో ఆయన హయాంలో కూడా క్రైస్తవులకు అనేక సంక్షేమ పథకాలు అందించారు. కానీ ఇప్పుడు హిందూత్వ ఎజెండాను బలంగా వినిపించడం వల్ల ఆ వర్గంలో అభద్రతా భావం ఏర్పడే అవకాశం ఉంది. దీనిని అధిగమించడానికి కూటమి నేతలు జాగ్రత్తగా అడుగులు వేయాల్సి ఉంటుంది. జగన్ ను కేవలం ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా మతపరమైన కోణంలో చూపిస్తే, అది ఇతర మైనార్టీ వర్గాలను కూడా దూరం చేసే ప్రమాదం పొంచి ఉంది. అందుకే తాము చేస్తున్న పోరాటం కేవలం ధర్మ పరిరక్షణ కోసమే తప్ప మరే ఇతర మతాన్ని కించపరచడానికి కాదని వారు పదేపదే చెబుతున్నారు. సంక్షేమ పథకాల లబ్ధి పొందుతున్న క్రైస్తవ, మైనార్టీ వర్గాలు చంద్రబాబు మాటలకు ప్రభావితం అవుతారా లేదా జగన్ వైపే నిలబడతారా అనేది తేలాల్సి ఉంది. ఇప్పటి వరకూ జరిగిన పరిణామాలు చూస్తే.. ఏపీ రాజకీయాల్లో కొత్త దారిలో అదే మత దారిలో వెళ్తున్నాయని క్లారిటీ వస్తుంది.

========================

FORM-IV

(RULE 8)

UNDER THE PRESS AND REGISTRATION OF BOOKS ACT. 1867

STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT NEWSPAPER BHARATHA SAKTHI.

1. Place of Publication : GUNTUR
2. Periodicity of its publication : Daily
3. RNI Registration No. : APTEL/2007/22515
4. Printer's Name : KESARAM PENTA REDDY
   Nationality : Indian
   (a) Whether a citizen of India? : Yes
   (b) If a Foreigner, the country of origin : N/A
   Address : Plot NoI.:31, Road No.:5B, Mallikarjuna Nagar, Sagar Ring Road, Bairamalguda, Hyderabad - 500 079.
5. Publisher's Name : KESARAM PENTA REDDY
   Nationality : Indian
   (a) Whether a citizen of India? : Yes
   (b) If a Foreigner, the country of origin : N/A
   Address : Plot NoI.:31, Road No.:5B, Mallikarjuna Nagar, Sagar Ring Road, Bairamalguda, Hyderabad - 500 079.
6. Editor's Name : KESARAM PENTA REDDY
   Nationality : Indian
   (a) Whether a citizen of India? : Yes
   (b) If a Foreigner, the country of origin : N/A
   Address : Plot NoI.:31, Road No.:5B, Mallikarjuna Nagar, Sagar Ring Road, Bairamalguda, Hyderabad - 500 079.
7. Name and addresses of individuals who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital Ltd. : Sri Mukhteswara Publications, Plot NoI.:31, Road No.:5B, Mallikarjuna Nagar, Sagar Ring Road, Bairamalguda, Hyderabad - 500 079.

I Kesaram Penta Reddy, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date: 28-02-2026
Place: Guntur.

Sd/- xxxx
Kesaram Penta Reddy
PUBLISHER

# దుర్గమ్మకు కుంభాభిషేకం



విజయవాడ, ఫిబ్రవరి 28,


కనకదుర్గమ్మ భక్తులకు ముఖ్య గమనిక. విజయవాడ ఇంద్రకీలాద్రిపై మహా కుంభాభిషేకం నిర్వహించనున్నారు. మార్చి 6వ తేదీ నుంచి 8 వరకూ మూడు రోజుల పాటు కనకదుర్గమ్మ ఆలయంలో మహా కుంభాభిషేకం మహోత్సవం జరగనుంది. ఇందుకోసం దుర్గ గుడి దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మహాకుంభాభిషేకం 12 ఏళ్లకు ఒకసారి వస్తుందని.. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అధికారులు కోరుతున్నారు. మరోవైపు కుంభాభిషేకంలో ముఖ్యమైన ఘట్టం మార్చి 8వ తేదీ ఉదయం నిర్వహించనున్నారు.విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో మహా కుంభాభిషేకం జరగనుంది. ఇంద్రకీలాద్రిపై జరగనున్న మహా కుంభాభిషేకం మహోత్సవం -2026కు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 6వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకూ మూడు రోజుల పాటు ఇంద్రకీలాద్రిపై కుంభాభిషేకం మహోత్సవం జరగనుంది. ఆగమ శాస్త్రాల ప్రకారం 12 ఏళ్లకు ఒకసారి ఇంద్రకీలాద్రిపై మహా కుంభాభిషేకం నిర్వహిస్తారు. 12 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఈ పవిత్ర ఆచారం ఆలయ దైవిక శక్తిని పునరుజ్జీవింపజేస్తుందని అర్చకులు, పండితులు చెప్తున్నారు.కనకదుర్గమ్మ ఆలయంపై ఉన్న కలశం మహా విష్ణువు, శివుడు, బ్రహ్మలతో పాటుగా జగన్మాతకు ప్రతీకగా చెప్తుంటారు. మహాకుంభాభిషేకంలో భాగంగా.. పవిత్ర నదులు, సముద్రాల నుంచి సేకరించిన పవిత్ర జలాలను.. యాగశాలలో కలశాలలోకి ఆవాహన చేస్తారు, వీటితో పాటు మంత్రోచ్చారణలు, హోమాలు, ఆగమ ప్రక్రియలు శాస్త్రోక్తంగా చేపడతారు. ఈ ఆచారం భక్తులకు, సమాజానికి మంచిని, ఆధ్యాత్మిక శ్రేయస్సును కలగజేస్తుందని విశ్వాసం. మహాకుంభాభిషేకంలో భాగంగా మార్చి 6వ తేదీ గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభం అవుతాయి. ఆ తర్వాత పుణ్యాహవచనం, దీక్షాధారణ, అంకురార్పణ, అగ్ని ప్రతిష్టాపన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆ తర్వాత మూల మంత్ర హవనమ్ కార్యక్రమం ఉంటుంది.మార్చి ఏడో తేదీన అష్టోత్తర కలశస్థాపన కార్యక్రమం నిర్వహిస్తారు. పవిత్ర నదుల నుంచి సేకరించిన జలాలతో ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. అలాగే పీఠ పూజ, ప్రత్యేక హోమం నిర్వహిస్తారు. మార్చి ఎనిమిదో తేదీ ఉదయం 9 గంటల 34 నిమిషాలకు ముఖ్యమైన కుంభాభిషేకం ఉంటుంది. ఆలయ విమాన గోపురంపై పవిత్ర జలాలతో అభిషేకం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి హాజరు కానున్నారు.

మహాకుంభాభిషేకం పూర్తైన తర్వాత కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి అనుగ్రహ భాషణం ఉ ంటుంది. ఈ నేపథ్యంలో 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ వేడుకలో పాల్గొనాలని ఆలయ అధికారులు భక్తులకు విజ్ఞప్తి చేశారు. మహాకుంభాభిషేకం కార్యక్రమం కోసం ఆలయ అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఈ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# హిందూ వర్సెస్ క్రిష్టియన్...

విజయవాడ, ఫిబ్రవరి 28,

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఇప్పుడు సిద్ధాంతాల నుంచి పూర్తిగా విశ్వాసాల వైపు మళ్లుతున్నాయి. గత కొన్ని నెలలుగా జరుగుతున్న పరిణామాలను గమనిస్తే.. రాష్ట్రంలో హిందూ వర్సెస్ క్రిస్టియన్ అనే ధోరణిని రాజకీయ పార్టీలు బలంగా




ప్రోత్సహిస్తున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వివాదం తర్వాత అధికార కూటమి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై హిందూ వ్యతిరేకి అనే ముద్రను బలంగా వేసేందుకు ప్రయత్నిస్తోంది. జగన్ తన వ్యక్తిగత విశ్వాసం ప్రకారం క్రైస్తవుడు కాబట్టి, ఆయనకు హిందూ ఆచారాలపై గౌరవం లేదనే వాదనను కూటమి నేతలు వినిపిస్తున్నారు.ఈ వ్యూహాన్ని తిప్పికొట్టేందుకు జగన్ మోహన్ రెడ్డి తన రాజకీయ శైలిని మార్చుకుంటున్నారు. తాను కేవలం ఒక మతానికే పరిమితం కాదని, హిందూ ధర్మాన్ని కూడా అంతే గౌరవిస్తానని చాటిచెప్పేందుకు ఆలయ సందర్శనలను పెంచారు. పులివెందులలో నందీశ్వర ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొనడం ఇందులో భాగమే. అయితే, ఈ క్రమంలో ఆయన కొన్ని సాంకేతిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. హోమగుండం వద్ద పూజారి ఇచ్చిన పదార్థాలను సరిగ్గా వేయకపోవడం ,హిందూ పూజా విధానాల్లో తడబడటం వంటి అంశాలను కూటమి సోషల్ మీడియా విభాగాలు హైలైట్ చేస్తూ ఆయన ప్రయత్నాలను నీరుగారుస్తున్నాయి.జగన్ ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ తన ఓటు బ్యాంకును కాపాడుకోవడం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండే సామాజిక వర్గాల్లో క్రైస్తవ మైనారిటీలు ప్రధానమైన వారు. జగన్ హిందూ ఓటర్లను ఆకట్టుకునే క్రమంలో అతిగా హిందూ ఆచారాలను పాటిస్తే, తన సొంత కోర్ ఓటు బ్యాంకులో అసంతృప్తి మొదలయ్యే ప్రమాదం ఉంది. మత రాజకీయాలు మనకెందుకు ' అనే భావన అటు హిందువుల్లోనూ, ఇటు మైనారిటీల్లోనూ కలగకుండా చూసుకోవడం జగన్‌కు ఇప్పుడు కత్తిమీద సాములా మారింది. ఇప్పటికే సోదరి షర్మిల దూకుడుగా రాజకీయం చేస్తున్నారు. ఆమె భర్త అనిల్ కుమార్ సుప్రసిద్ధ మత ప్రచారకుడు. గతంలో జగన్ కోసం చర్చిలను ఏకం చేశారు. ఇప్పుడు వారు కూడా జగన్ కువ్యతిరేకంగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం జగన్‌ను ఒక మతానికి మాత్రమే పరిమితం చేసి, హిందూ ఓట్లను ఏకీకృతం చేయాలని చూస్తోంది. దీనికి ప్రతిగా జగన్ సర్వమత సమభావన అనే ముసుగులో హిందూత్వ ఇమేజ్ కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే, ఈ మతపరమైన పోలరైజేషన్ రాష్ట్రంలో రాజకీయాన్ని మార్చబోతోంది. భవిష్యత్తులో జగన్ మరిన్ని దేవాలయ పర్యటనలు చేసినా, కూటమి వేసే మత ముద్ర నుంచి ఆయన ఎంతవరకు బయటపడతారనేది సందేహమే. ఒకవైపు తనపై పడుతున్న క్రైస్తవ ముద్రను తుడిచేసుకోవడం, మరోవైపు తన సొంత ఓటు బ్యాంకును దూరం చేసుకోకుండా ఉండటం.. ఈ రెండు విభిన్న పార్శ్వాల మధ్య జగన్ మోహన్ రెడ్డి రాజకీయంగా అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఈ మత పోరు రాబోయే ఎన్నికల నాటికి ఏ స్థాయికి చేరుతుందో చూడాలి.

# హీటెక్కుతున్న బెంగాల్ రాజకీయం

కోల్ కత్తా, ఫిబ్రవరి 28, (

పశ్చిమ బెంగాల్ రాజకీయ రణరంగం మరోసారి హీటెక్కుతోంది. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం అటు అధికార తృణమూల్ కాంగ్రెస్, ఇటు దూసుకొస్తున్న భారతీయ జనతా పార్టీ మధ్య చావో రేవో తేల్చుకునే పోరు మొదలైంది. పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఎన్నడూ లేని విధంగా ముక్కోణపు పోటీ పోయి, ఇప్పుడు నేరుగా టీఎంసీ వర్సెస్ బీజేపీ మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. 2019 లోక్‌సభ ఎన్నికల నుంచి బెంగాల్‌లో పాగా వేయడమే లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ, ఈసారి రాష్ట్రమంతటా భారీగా కేడర్‌ను మోహరించింది. ముఖ్యంగా ఉత్తర బెంగాల్ మరియు గిరిజన ప్రాంతాల్లో బీజేపీ పట్టు పెంచుకుంటూ వస్తోంది.

ప్రధాని మోదీ, అమిత్ షా వంటి అగ్రనేతలు బెంగాల్‌ను ఒక ప్రతిష్టాత్మక యుద్ధంగా భావించి ప్రతి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. హిందూ ఓట్ల పోలరైజేషన్ తమకు కలిసొస్తుందని బీజేపీ బలంగా నమ్ముతోంది.మరోవైపు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బెంగాల్ కుమార్తెను అనే సెంటిమెంట్‌తో ప్రజల్లోకి వెళ్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లక్ష్మీర్ భండార్ వంటి సంక్షేమ పథకాలు మహిళా ఓటర్లను కట్టిపడేశాయి. అయితే, సందేశ్‌ఖాలీ వంటి ఘటనలు, టీఎంసీ స్థానిక నాయకులపై వస్తున్న అవినీతి ఆరోపణలు మమతా ప్రభుత్వానికి కొంత ఇబ్బందికరంగా మారాయి. ముస్లిం ఓటు బ్యాంకు చెల్లాచెదురు కాకుండా చూసుకోవడం మమతకు ఇప్పుడు కీలకం. ఈసారి ఎన్నికల్లో దీదీ తన వ్యక్తిగత చరిష్మాపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు.ఒకప్పుడు బెంగాల్‌ను దశాబ్దాల పాటు ఏలిన కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ రెండు పార్టీలు మనుగడ కోసం పోరాడుతున్నాయి. లెఫ్ట్ పార్టీల ఓటు బ్యాంకు ఇప్పటికే పెద్ద ఎత్తున బీజేపీ వైపు మళ్లిపోయింది. యువతను ఆకట్టుకోవడానికి కమ్యూనిస్టులు కొత్త ముఖాలను రంగంలోకి దించుతున్నా, అది ఎన్నికల ఫలితాల్లో సీట్లుగా మారడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ పార్టీ కేవలం మాల్దా, ముర్షిదాబాద్ వంటి కొన్ని పాకెట్లకే పరిమితం కానుంది. బీజేపీకి ఈసారి అధికారంలోకి రావడానికి గతంలో కంటే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని స్థానిక సర్వేలు చెబుతున్నాయి.

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన అసంతృప్తిని ఓట్లుగా మలుచుకోవడంలో కాషాయ దళం సక్సెస్ అయితే బెంగాల్ చరిత్ర మారుతుంది. అయితే, మమతా బెనర్జీని తక్కువ అంచనా వేయలేం. ఎన్నికల సమయంలో ఆమె చేసే పోరాట పటిమ, వీధి పోరాటాలు చివరి నిమిషంలో ఫలితాలను తారుమారు చేయగలవు. బెంగాల్ పీఠం ఎవరిదనేది ఈసారి అతి తక్కువ ఓట్ల శాతంతో తేలేలా ఉంది. బీజేపీ దండయాత్ర ఫలించి కోటను స్వాధీనం చేసుకుంటుందా.. లేక మమత తన బెంగాల్ టైగర్ ఇమేజ్‌తో హ్యాట్రిక్ కొడుతుందా అనేది దేశవ్యాప్తంగా ఉత్కంఠను రేపుతోంది.

================

# కేజ్రీ కాన్ఫిడెన్స్ ఏంటీ...

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28,



2025 లో ఇదే నెలలో అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. 2013 నుంచి ఏకంగా 12 ఏళ్ల పాటు వరుసగా గెలుస్తూ వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ ఆ ఎన్నికల్లో ఓటమి పాలు అయింది. 1998 తరువాత దాదాపు మూడు దశాబ్దాల అనంతరం కమలం పార్టీ ఢిల్లీ ఎన్నికల్లో గెలిచింది. బీజేపీకి చెందిన రేఖా గుప్తా కొత్త ముఖ్యమంత్రి అయ్యారు. ఆం ఆద్మీ పార్టీ ఓటమి పాలు కావడమే కాదు ఏకంగా అధినేత ముఖ్యమంత్రి అయిన కేజ్రీవాల్ ఓటమి పాలు అయ్యారు. ఇది నిజంగా ఆమ్ ఆద్మీ పార్టీ పుట్టాక ఎన్నడూ చూడని ఘోర పరాజయం. దాంతో ఆం ఆద్మీ పార్టీ శ్రేణులు అన్నీ కృంగిపోయాయి. ఏడాదిగా చూస్తే కేజ్రీవాల్ సందడి ఎక్కడా లేదు, ఆయన మీడియాకి దూరం పాటిస్తూ వచ్చారు. : దీనికి అంతటికీ కారణం లిక్కర్ స్కాం లో ఆమ్ ఆద్మీ పార్టీ నిండా కూరుకునిపోయింది అని జరిగిన రాజకీయ ప్రచారం. దానికి తగినట్లే సీబీఐ కేజ్రీవాల్ తో పాటు ఆప్ కి చెందిన కీలక నేతలు మంత్రులను కూడా అరెస్టు చేసింది. ఆ విధంగా అయిదు నెలలకు పైగా కేజ్రీవాల్ జైలు జీవితం అనుభవించారు. నిజాయితీతో కూడిన రాజకీయం కోసం తాను జనం లోకి వచ్చాను అని చెప్పుకునే కేజ్రీవాల్ తప్పు చేశారు అని లిక్కర్ స్కాం లో ఇరుక్కున్నారు అని జనాలు కూడా నమ్మే పరిస్థితి. బీజేపీ కూడా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలో చేసిన ప్రచారం దీనినే కేంద్ర బిందువుగా చేసుకుని సంధించిన అస్త్రాలు అన్నీ కలసి ఆప్ ఓటమి పాలు అయింది అయితే ఏడాది తిరగకుండానే ఈ కేసులో కేజ్రీవాల్ నిర్దోషి అని తేలింది. ఆధారాలు ఏవీ లేవని కోర్టు అయితే స్పష్టమైన తీర్పు చెప్పింది. అంతే కాదు కేజ్రీవాల్ తో పాటు అనేక మందికి కూడా ఈ కోర్టు తీర్పు వల్ల ఎంతో ఊరట లభించింది. దీంతో తాజాగా వచ్చిన తీర్పుతో కేజ్రీవాల్ కన్నీటి పర్యంతం అయ్యారు. భావోద్వేగానికి గురి అయ్యారు. ఇదిలా ఉంటే ఎక్సైజ్ పాలసీ కుంభకోణం కేసులో సీబీఐ చార్జిషీట్‌ను రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం కొట్టివేసిన నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని నేరుగా సవాల్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీకి కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆ ఎన్నికల్లో బీజేపీ కనీసంగా పది స్థానాలకు పైగా గెలిస్తే తాను రాజకీయాలను వదిలివేస్తానని కేజ్రీవాల్ గట్టిగా చెప్పారు. ఢిల్లీ ప్రజలు ఆమ్ ఆద్మీ ప్రభుత్వం పనితీరు పట్ల సంతోషంగా ఉన్నారని ఓడించడం కష్టమని తేలిన తరువాత బీజేపీ ఈ విధంగా తమ మీద కుట్ర పన్నిందని ఆయన ఆరోపించారు. కేజ్రీవాల్ నిజాయితీపరుడని ఢిల్లీ ప్రజలకు తెలుసు కాబట్టి వారు నా నిజాయితీ పైనే దాడి చేశారని బీజేపీ అగ్ర నేతల మీద మండిపడ్డారు. బీజేపీ వారు నన్ను మద్యం కుంభకోణంలో ఇరికించారని వంద కోట్ల రూపాయల ఆరోపణలు చేశారని ఆయన ఆరోపించారు. నా జీవితంలో నిజాయితీ, గౌరవం తప్ప మరేమీ సంపాదించలేదని ఆయన చెప్పారు. తాను ఒక్క అక్రమ పైసా కూడా సంపాదించలేదని అంతే కాదు తాను వారిలా లేనని బీజేపీ మీద విమర్శలు చేశారు. తన మీద కుట్ర చేస్తూ గత నాలుగు సంవత్సరాలుగా మద్యం కుంభకోణం అని పిలువబడే దానిని తమ పార్టీకి వ్యతిరేకంగా వాడారని, ఈడీ సీబీఐ సహా అన్ని కేంద్ర సంస్థలను ఉపయోగించుకున్నారని ఆప్ అధినేత ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రేజీ సవాల్ మీద : మరి కేజ్రీవాల్ సవాల్ కి బీజేపీ నేతలు స్పందిస్తారా అన్నది చూడాలి. ఇపుడు ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు తిరిగి నిర్వహిస్తారా అన్నది కూడా ఆలోచించాలి. అయితే అలాంటిది ఎవరూ చేయరు, చేసే సాహసం కూడా చేయరని అంటున్నారు. ఎందుకంటే మళ్ళీ ఎన్నికలు అంటే నిజంగా కేజ్రీవాల్ చెప్పినట్లు బీజేపీకి 10 సీట్లు రాకపోయినా గెలుపు మళ్లీ దక్కుతుందా అంటే అది కూడా ఆలోచించాల్సిందే అని అంటున్నారు.

## కష్టాల్లో ఉన్నా

# నోరుతెరవని ఫైర్ బ్రాండ్స్

విజయవాడ ఫిబ్రవరి 28,

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చాలామంది ఫైర్ బ్రాండ్లు ఉ న్నారు. ఎందుకో గాని వారంతా ఇప్పుడు సైలెంట్ గా ఉన్నారు. అసలు వారు యాక్టివ్ అవుతారా? లేదా? అనే చర్చ బలంగా నడుస్తోంది. ఎందుకంటే ఇప్పుడు పార్టీ కష్టకాలంలో ఉంది. వారి అవసరం పార్టీకి ఏర్పడింది. అయినా సరే వారి పెద్దగా నోరు తెరవడం లేదు. ఏదో పార్టీలో ఉన్నాం అంటే ఉన్నాం అన్నట్టు ఉంది వారి వ్యవహారం. కనీసం నోరు తెరవడం లేదు



కూడా వారు. కూటమి ప్రభుత్వం నుంచి నెయ్యి కల్తీ వ్యవహారంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సవాళ్లు ఎదురవుతున్నాయి. ఇటువంటి సమయంలో అండగా నిలవాల్సిన ఈ ఫైర్ బ్రాండ్లు అంతా ముఖం చాటేస్తుండడం మాత్రం విమర్శలకు తావిస్తోంది. పార్టీ కష్టంలో ఉన్నప్పుడే స్పందించాలి కానీ.. పార్టీ బాగున్నప్పుడు ఎందుకులే అనే ప్రశ్న వినిపిస్తోంది.ఎవరు అవునన్నా కాదన్నా నెయ్యి కల్తీ వ్యవహారంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ డ్యామేజ్ జరిగింది. దానిని కంట్రోల్ చేసే పనిలో భాగంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బలమైన వాయిస్ వినిపిస్తోంది. కానీ ఇది చాలడం లేదు. ఎవరో ఒకరిద్దరు మాత్రమే స్పందిస్తున్నారు. ముఖ్యంగా మాజీ మంత్రులు ఆర్కే రోజా, అనిల్ కుమార్ యాదవ్, కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్ వంటి వారు నోరు తెరవకపోవడం పై రకరకాల చర్చ నడుస్తోంది. 2014 నుంచి 2019 వరకు వైయస్సార్ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు.. 2019 నుంచి 2024 మధ్య అధికారంలో ఉన్నప్పుడు.. వీరు ఓ స్థాయిలో రెచ్చిపోయేవారు. అధినేత జగన్ పై ఈగ వాలనిచ్చేవారు కాదు. కానీ ఇప్పుడు అమాంతం పెద్దపెద్ద నిందలు, ప్రత్యర్థుల బలమైన ఆరోపణలు చేస్తున్నా స్పందించకపోవడం ఏమిటనే ప్రశ్న వినిపిస్తోంది.పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చాలామంది మాట్లాడతారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడితేనే.. పార్టీ తరపున వాయిస్ వినిపిస్తేనే ఫలితం ఉంటుంది. అయితే వైసిపి హయాంలో ఫైర్ బ్రాండ్లుగా పేరు పొందిన ఈ నేతలంతా ఆడిన మాటలు రాష్ట్ర ప్రజలకు తెలియంది కాదు. అందుకే ఫలానా ఫైర్ బ్రాండ్ ఏమైపోయారు అని ప్రజలు ఇప్పుడు ఆరా తీయడం చూస్తున్నాం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం ఒకరిద్దరు నేతలు మాత్రమే మాట్లాడుతున్నారు. మిగతావారు మాత్రం ఫుల్ సైలెన్స్ పాటిస్తున్నారు. అందుకే సోషల్ మీడియాలో సెటైర్లు పడుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫైర్ బ్రాండ్లకు ఏమైందని ఎక్కువ మంది ప్రశ్నిస్తున్నారు. అయితే ఇందులో కొందరు తమ సొంత వృత్తులు, వ్యాపారాలు చేసుకుంటున్నారు. పరిస్థితికి తగ్గట్టు బయటకు రావాలని భావిస్తున్నారు. అప్పటివరకు సైలెంట్ మోడ్ లో ఉండడమే ఉత్తమని ఒక నిర్ణయానికి వచ్చారన్నమాట

================

# సెంటిమెంట్ నుంచి సమస్యల దిశగా

హైదరాబాద్, ఫిబ్రవరి 28,

అసెంబ్లీ ఎన్నికల తర్వాత బలహీనంగా కనిపిస్తున్న భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఇప్పుడు పూర్తిగా మారిన వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఒకప్పుడు సెంటిమెంట్ ఆధారంగా నడిచిన పార్టీ, ఇప్పుడు ప్రజా సమస్యలను ఆయుధంగా మార్చుకుంటూ "గ్రౌండ్ లెవల్ రీకనెక్ట్" పై దృష్టి సారించింది. పైకి ప్రశాంతంగా కనిపిస్తున్నా, లోపల మాత్రం గులాబీ దళం పునర్వ్యవస్థీకరణకు అధినేత కేసీఆర్ నిశ్శబ్దంగా కార్యాచరణ చేపట్టారు.పార్టీని మళ్లీ బలోపేతం చేయాలంటే క్షేత్రస్థాయి నుంచి మొదలు పెట్టాలనే నిర్ణయానికి బీఆర్ఎస్ వచ్చింది. అందుకే ఇప్పుడు హైదరాబాద్ రాజకీయాలకు పరిమితం కాకుండా జిల్లాలపై ఫోకస్ పెంచుతోంది. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేరుగా బాధితుల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటూ ప్రభుత్వంపై విమర్శలు మోస్తున్నారు.భూసేకరణ, భూముల వివాదాలు, రైతుల సమస్యలు, నిరుద్యోగం వంటి అంశాలపై ప్రత్యక్షంగా స్పందిస్తూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఖమ్మం, నాగర్ కర్నూల్ వంటి జిల్లాల్లో ఇప్పటికే పర్యటనలు ప్రారంభించారు. త్వరలో రైతు ఆత్మహత్యల కుటుంబాలను కూడా పరామర్శించేలా ప్లాన్ చేస్తున్నారు.ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ కేంద్రంగా కేసీఆర్ రాజకీయ వ్యూహాలు రచిస్తున్నారు. బయటకు పెద్దగా కనిపించకపోయినా, పార్టీని మళ్లీ నిలబెట్టేందుకు క్రమంగా పావులు కదుపుతున్నారు. నియోజకవర్గాల వారీగా కీలక నేతలతో టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ ఓటమి కారణాలను విశ్లేషిస్తున్నారు.కార్యకర్తల్లో నెలకొన్న నిరుత్సాహాన్ని తొలగించి, "మళ్లీ మనదే పాలన" అనే నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం జరుగుతోంది. అలాగే సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక బృందాలను కూడా సిద్ధం చేస్తున్నారు.పార్టీ నుంచి కొందరు నేతలు వెళ్లిపోతున్నా, కేసీఆర్ మాత్రం తొందరపడటం లేదు. పార్టీ మారే వారిని ఆపేందుకు కంటే, మిగిలిన నిబద్ధత గల నాయకులతో బలమైన బృందాన్ని నిర్మించాలనే దిశగా అడుగులు వేస్తున్నారు.ద్వితీయ శ్రేణి నాయకత్వానికి ప్రాధాన్యం ఇస్తూ, ప్రతి మండలానికి ఇన్‌ఛార్జ్‌లను నియమించాలనే ఆలోచనలో ఉన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటినుంచే క్యాడర్‌ను సిద్ధం చేస్తున్నారు.

గతంలో తెలంగాణ సెంటిమెంట్‌పై ఆధారపడి విజయాలు సాధించిన బీఆర్ఎస్, ఇప్పుడు పూర్తిగా ప్రజా సమస్యలపై దృష్టి మళ్లిస్తోంది. నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ, పెన్షన్ల పంపిణీలో జాప్యం వంటి అంశాలను ప్రభుత్వంపై అస్త్రాలుగా ఉపయోగించేందుకు సిద్ధమవుతోందిప్రజా సమస్యలపై పోరాటం ద్వారా కోల్పోయిన విశ్వాసాన్ని తిరిగి సంపాదించుకోవచ్చని పార్టీ భావిస్తోంది. శాసనసభలో కూడా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేలా వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు.బయటకు నిశ్శబ్దంగా కనిపిస్తున్నా, బీఆర్ఎస్ లోపల భారీ మార్పులు జరుగుతున్నాయి. సరైన సమయం చూసి పార్టీని పూర్తిగా రీ యాక్టివేట్ చేయాలనే లక్ష్యంతో కేసీఆర్ ముందుకు సాగుతున్నారు.గోదావరి జలాల పేరుతో బహిరంగ సభల ద్వారా పార్టీకి కొత్త ఊపు తీసుకురావాలని భావించినా, ఎన్నికల నేపథ్యంలో ఆ ప్లాన్ వాయిదా పడింది. అయితే, పరిస్థితులు అనుకూలంగా మారిన వెంటనే గులాబీ దళం మళ్లీ పూర్తి స్థాయిలో రంగంలోకి దిగే సూచనలు కనిపిస్తున్నాయి.ఓటమి తర్వాత వెనక్కి తగ్గినట్టుగా కనిపించిన బీఆర్ఎస్, ఇప్పుడు కొత్త రూపంలో తిరిగి వస్తోంది. కేసీఆర్ సైలెంట్ ఆపరేషన్, కేటీఆర్ గ్రౌండ్ యాక్టివిటీ, కొత్త నాయకత్వం కలయికతో గులాబీ దళం మళ్లీ బలపడుతుందా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# మైండ్ గేమ్ ఆలోచనలో గులాబీ బాస్

హైదరాబాద్, ఫిబ్రవరి 28,

తెలంగాణ రాజ్యసభ ఎన్నికల చదరంగంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ ఎత్తుగడలకు పదును పెడుతున్నాయి. సంఖ్యాబలం తక్కువగా ఉన్నా సరే పోటీకి దిగడం ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలని బీఆర్ఎస్ భావిస్తుండగా, క్లీన్ స్వీప్ చేయాలని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది. అసెంబ్లీలో ఉన్న 119 మంది ఎమ్మెల్యేల లెక్కల ప్రకారం ఒక్కో అభ్యర్థి గెలవడానికి దాదాపు 60 ఓట్లు అవసరం. ప్రస్తుతం బీఆర్ఎస్‌కు ఉన్న బలం రీత్యా గెలుపు సాధ్యం కాకపోయినా, ఒక మైనార్టీ అభ్యర్థిని పోటీలో నిలబెట్టడం ద్వారా కాంగ్రెస్‌ను ఆత్మరక్షణలో పడేయాలని చూస్తున్నారు. ఒకవేళ తమ అభ్యర్థికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఓటు వేస్తే, మైనార్టీల వ్యతిరేకిగా ముద్ర వేయవచ్చనేది ప్రతిపక్ష పార్టీ ఆలోచన. ఈ ఎత్తుగడ ద్వారా కాంగ్రెస్ తన అభ్యర్థుల ఎంపికలో మార్పులు చేసుకునేలా ఒత్తిడి తేవడమే ప్రధాన లక్ష్యం.బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలను ఇరకాటంలో పెట్టడం కూడా ఈ పోటీ వెనుక ఉన్న మరో ఉద్దేశం. రాజ్యసభ ఎన్నికల ప్రక్రియలో పార్టీలు విప్ జారీ చేసే అధికారం కలిగి ఉంటాయి. అయితే, ఓటింగ్ రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరుగుతుంది. ఎవరు ఎవరికి ఓటు వేశారనేది పార్టీ ఏజెంట్లకు స్పష్టంగా తెలుస్తుంది. పార్టీ ఆదేశాలను ఉల్లంఘించి ఓటు వేస్తే పదవి పోతుందనే భయం ఒకవైపు, సొంత పార్టీకి వ్యతిరేకంగా వెళ్లలేని పరిస్థితి మరోవైపు ఫిరాయింపు ఎమ్మెల్యేలను వెంటాడుతున్నాయి. విప్ ఉల్లంఘనపై అనర్హత వేటు పడుతుందా లేదా అనే అంశంపై సుప్రీంకోర్టులో గతంలో భిన్నమైన తీర్పులు ఉన్నా, రాజకీయంగా వారిని దోషులుగా నిలబెట్టాలని బీఆర్ఎస్ ఆశిస్తోంది.ప్రస్తుతం శాసనసభలో కాంగ్రెస్ పార్టీకి 64 మంది సొంత ఎమ్మెల్యేలు ఉండగా, బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారితో కలిపి ఆ సంఖ్య 73కి పెరిగింది. ముగ్గురు పోటీలో ఉంటే రెండు స్థానాలను గెలవడానికి కావాల్సిన ఓట్లు సుమారు 80 ఓట్లు. మజ్లిస్ మద్దతుతో సాధించడం పెద్ద కష్టమేమీ కాదు. మజ్లిస్ పార్టీ మద్దతు కూడా కాంగ్రెస్‌కే ఉండే అవకాశం ఉండటంతో సంఖ్యాపరంగా అధికార పార్టీకి ఎటువంటి ఢోకా లేదు. బీఆర్ఎస్ పోటీ పెడితే మాత్రం ప్రతి ఓటును జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఉంటుంది. ఏమాత్రం తేడా వచ్చినా అది ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడిని పెంచుతుందిగెలుపు అవకాశాలు లేవని తెలిసినా బీఆర్ఎస్ మైనార్టీ కార్డును ప్రయోగించడం వెనుక ఆత్మప్రబోధానుసారం ఓటు అనే



అంశాన్ని తెరపైకి తెచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్ లోని అసమ్మతి నేతలు, మైనార్టీ అభ్యర్థి పట్ల సానుభూతి ఉన్నవారు తమకు ఓటు వేస్తారని బీఆర్ఎస్ ఆశిస్తోంది. ఇది కేవలం గెలుపు కోసం చేసే ప్రయత్నం కంటే కూడా, కాంగ్రెస్ పార్టీలో చీలికలు ఉన్నాయని నిరూపించడానికి చేసే ఒక రాజకీయ ప్రయోగం. ఒకవేళ కాంగ్రెస్ లోని మైనార్టీ ఎమ్మెల్యేలు లేదా ఇతర నేతలు ఈ విషయంలో అసంతృప్తి వ్యక్తం చేస్తే అది బీఆర్ఎస్‌కు పెద్ద విజయంగా మారుతుంది.ఈ రాజ్యసభ ఎన్నికలు కేవలం సభ్యుల ఎంపికతో ముగిసేవి కావు. వీటి ఫలితం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా ప్రభావం చూపుతుంది. మైనార్టీ ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి కాంగ్రెస్ పడే తపన, వారిని ఇబ్బంది పెట్టడానికి బీఆర్ఎస్ వేసే ఎత్తుగడలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తాయి. అభ్యర్థుల ఖరారు నుండి ఓటింగ్ ముగిసే వరకు ప్రతి అడుగు అత్యంత కీలకంగా మారనుంది. అంతిమంగా ఈ యుద్ధం సంఖ్యాబలానికి, సామాజిక వ్యూహాలకు మధ్య జరుగుతున్న పోరాటంగా మిగిలిపోనుంది.

# టీచర్లకు గట్టి షాక్.. ప్రమోషన్లు కట్.. పనిచేస్తేనే ముందుకు..

హైదరాబాద్, ఫిబ్రవరి 28,

ప్రభుత్వం ఉద్యోగం వచ్చిందంటే లైఫ్‌సెట్ రా.. అంటారు. ఎందుకంటే రాజ్యాంగం వారికి అలాంటి భద్రత కల్పించింది. కానీ ప్రైవేటులు ఎలాంటి రక్షణ ఉండదు. పనిచేస్తే చేయించుకుంటారు. లేదంటే తీసివడేసి మరొకరిని పెట్టుకుంటారు. కానీ, ప్రభుత్వ ఉద్యోగులు పని చేసినా.. చేయకపోయినా.. తొలగించడం ఉండదు. మహా అయితే సస్పెండ్ చేస్తారు. తర్వాత తిరిగి తీసుకుంటారు. ఇక పదోన్నతులు అయితే.. సీనియారిటీ పెరిగే కొద్ది వస్తుంది. ఇందులోనూ రిజర్వేషన్లు ఉంటే ఇంకా తొందరగా వస్తుంది. ఇక ప్రభుత్వ విద్య గురించి కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. 99 శాతం మంది టీచర్లకే తాము చెప్పే చదువుపై నమ్మకం లేదు. అందుకే తమ పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు పంపుతారు. ఇక సర్కార్ బడికి వచ్చే పిల్లలకు మాత్రం ఏదో చెప్పాలి కాబట్టి అన్నట్లుగా పాఠాలు చెబుతుంటారు.తెలంగాణలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేలా చర్యలు చేపడుతోంది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. ఈ క్రమంలో ఇప్పటికే విద్యావిధానంలో మార్పులు చేసింది. అడ్మిషన్లు పెంచే బాధ్యత ఉపాధ్యాయులకు అప్పగించింది. ఇక ఉపాధ్యాయుల పదోన్నతుల విషయంలోనూ కీలక నిర్ణయం తీసుకుంది. సీనియారిటీ ఆధారంగా ఉపాధ్యాయులకు ఇచ్చే పదోన్నతులు రద్దు చేసింది. ఇకపై పనితీరు ఆధారంగానే ప్రోత్సాహకాలు, పదోన్నతులు ఇవ్వాలని నిర్ణయించింది. ఐదేళ్లకు ఒకసారి ఉపాధ్యాయుల పనితీరును మూల్యాంకనం చేస్తారు.పనితీరు మెరుగుపడకపోతే, రెండేళ్ల సమయం ఇచ్చి సర్వీస్ నుంచి తొలగించే నియమాలు రూపొందించాలని కమిషన్ సూచించింది. ఈ నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టేబుల్ మీద ఉంచింది. విద్యా రంగంలో నెలకొన్న నిర్లక్ష్యం, ప్రభుత్వ పాఠశాలలపై సడలిన విశ్వాసాన్ని పునరుద్ధరించడమే ఈ కొత్త నిబంధనల లక్ష్యంఈ సూచనలు తెలంగాణ విద్యా వ్యవస్థకు విప్లవాత్మక మలుపు తిప్పుతాయి. ప్రస్తుతం సేవా కాలం ఆధారంగా పదోన్నతులు వచ్చే వ్యవస్థ ఉపాధ్యాయుల్లో ఉత్సాహాన్ని తగ్గిస్తోంది. పనితీరు మూల్యాంకనం ద్వారా బాధ్యతను పెంచడం విద్యార్థుల ప్రయోజనానికి దారితీస్తుంది.

# రోజుకో మలుపు తిరుగుతున్న భూదాన్ ఉద్యమం

ఖమ్మం, ఫిబ్రవరి 28,

కొన్ని రోజులుగా ఖమ్మం శివారు వెలుగుమట్లలోని వినోభా నవోదయ కాలనీ వార్తల్లో మార్మోగుతోంది. పదిహేను సంవత్సరాలకుపైగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లు, గుడిసెలను ప్రభుత్వం భారీగా పోలీసులను మోహరించి రాత్రికి రాత్రే ఖాళీ చేయించడం సంచలనంగా మారుతోంది. అడ్డుకునేందుకు బాధితులు చేసిన నిరసన సైతం ఎలాంటి ప్రయోజనం ఇవ్వలేదు. ఈ చర్యపై అన్ని వర్గాల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడా బాధితులకు తాము అండగా ఉన్నామని ప్రతిపక్షాలు ముందుకొస్తున్నాయి. బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా బాధితుల పరామర్శకు వెళ్తున్నారు. ఇంతకీ అసలేంటీ భూదాన్ భూముల వివాదం,దశాబ్దాల క్రితం ఆచార్య వినోబాభావే దేశవ్యాప్తంగా చేపట్టిన భూదాన్ ఉద్యమంతో స్ఫూర్తి పొందిన కొందరు దాతలు వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలోని సుమారు 31 నుంచి 60 ఎకరాల తమ భూమిని పేదలకు పంపిణీ చేయమని ప్రభుత్వానికి ఇచ్చారు. భూమి లేని నిరుపేదలకు ఒక గూడు దొరుకుతుందన్నది వారి ఆశయం. అయితే భూదాన్ బోర్డు పేరుతో స్థలం ఉన్నప్పటికీ అధికారికంగా ఎవరికీ ఈ స్థలంలో పట్టాలు కేటాయించలేదు. కాలక్రమేణా ఖమ్మం పట్టణం విస్తరించడం, నగరంలో కొత్త కలెక్టరేట్ కూడా ఈ ప్రాంతానికి అత్యంత సమీపంలోనే నిర్మాణమవడంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఏళ్ల క్రితం 'దానం'గా వచ్చిన భూమి ఇప్పుడు కోట్ల రూపాయల 'బిజినెస్'గా మారిపోయింది.

10 ఏళ్లకుపైగా 'వినోబా నవోదయ కాలనీ'పేరుతో సుమారు 600 నుంచి 1,000 కుటుంబాలు అక్కడ గుడిసెలు, రేకుల ఇళ్లు వేసుకుని నివసిస్తున్నాయి. వీరికి మున్సిపల్ అధికారులు నల్లా కనెక్షన్లు ఇచ్చారు, విద్యుత్ శాఖ మీటర్లు బిగించారు. అంతేకాదు, గత ఎన్నికల సందర్భంగా ఇక్కడ ఓట్లు కోరిన రాజకీయ నాయకులు వారికి పట్టాలు ఇస్తామనే హామీలు కూడా ఇచ్చారు. కానీ భూదాన్ బోర్డు నుంచి ఈ భూమి ఎవరికీ అధికారికంగా కేటాయించలేదనీ, కొందరు దళారులు నకిలీ పత్రాలతో ఇక్కడ పేదలను చేర్పించి లక్షల రూపాయలు వసూలు చేశారని ప్రభుత్వం, రెవెన్యూ అధికారుల వాదన.ప్రస్తుత ఉద్రిక్తతలకు రెండు ప్రధాన కారణాలు.. భూదాన్ బోర్డు ఆస్తులను రక్షించడంలో విఫలమైతే అధికారులదే బాధ్యత అని హైకోర్టు ఘాటుగా స్పందించింది. దీంతో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన రంగంలోకి దిగి స్థలం స్వాధీనం చేసుకోవాలనే చర్యలు చేపట్టింది. ఇది ఒకవైపు నుంచి వినిపిస్తున్న వాదన. ఈ భూమికి కేవలం 500 మీటర్ల దూరంలోనే కొత్త కలెక్టరేట్ నిర్మాణం జరగడంతో, ఇక్కడి భూమి విలువ ఎకరాకు ?10 కోట్లకుపైగా పెరిగింది. మొత్తం భూమి విలువ సుమారు రూ 250 నుంచి 300 కోట్లు కావడంతో అధికార యంత్రాంగం దీనిపై కన్నేసిందన్న విమర్శ రెండోది.ఈ వాదనలు ఇలా సాగుతున్న టైంలోనే ఈనెల 24న పెద్ద ఎత్తున ఆక్రమణల కూల్చివేత కార్యక్రమం జరిగింది. మూడు జిల్లాల నుంచి సుమారు 1,000 మందికి పైగా పోలీసుల పహారాలో, ఎస్.డి.ఆర్.ఎఫ్ (ాఆఖీఈ) బృందాల సమక్షంలో డజన్ల కొద్దీ జెసిబిలతో ఇళ్లను నేలమట్టం చేశారు. మహిళలు అడ్డుకోవడానికి ప్రయత్నించినా, కొందరు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడినా యంత్రాంగం వెనకడుగు వేయలేదు. "మా ఓట్లు తీసుకునేటప్పుడు ఈ భూమి ప్రభుత్వానిదని తెలీదా?" అని బాధితులు ప్రశ్నించారు.ఇప్పుడు పూర్తిగా రాజకీయ రంగు పులుముకుంటోందా.. ఎన్నికలకు ముందు అన్నిపార్టీల వాళ్లూ తమకు పట్టాలిస్తామని చెప్పారు. ఇప్పుడు అధికార పార్టీ నేతలు కానీ జిల్లా నుంచే మంత్రులైన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎందుకు మొహంచాటేస్తున్నారంటూ బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కేవలం ప్రభుత్వ భూమిని కాపాడుతున్నామని కాంగ్రెస్ చెబుతోంది. భూమాఫియా నుంచి భూదాన్ భూములను విడిపించడమే లక్ష్యంగా పేర్కొంటున్నారు. తమ హయాంలో ప్రభుత్వం కనీస వసతులు కల్పించగా, రేవంత్ సర్కారు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు కూల్చడం అమానుషమని బీఆరెస్, వామపక్షాలు విమర్శిస్తున్నాయి. కారణాలేవైనా దశాబ్దాలుగా అక్కడ బతుకుతున్న పేదల జీవితాలు ఒక్కరోజులో రోడ్డున పడ్డాయి. ఉన్నట్టుండి నివాసాలు కూల్చేసి తాత్కాలికంగా ఫంక్షన్ హాళ్లలో వసతి కల్పించిన ప్రభుత్వం వారికి శాశ్వత ప్రత్యామ్నాయం మాత్రం చూపలేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. నేటి రియల్ ఏస్టేట్ భూమ్‌లో పెరుగుతున్న భూముల ధరలకూ, సొంత గూడు కలకు మధ్య నలుగుతున్న పేదవాడికి పరిష్కారం చూపకపోతే ఈ వేడి ఖమ్మం నగరాన్ని మరింత రగిలించే అవకాశం కనిపిస్తోంది.

# మాకో సీటు కావాలంటూ ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు

హైదరాబాద్, ఫిబ్రవరి 28,

రాజ్యసభకు నోటిఫికేషన్ విడుదలైంది. తెలంగాణలో రెండు స్థానాలు ఖాళీ అవుతుండటంతో అధికార కాంగ్రెస్ లో ఆశావహుల జాబితా పెద్దగానే కనిపిస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ రెండు స్థానాలనూ దక్కించుకునే అవకాశాలు మెండుగా కనిపిస్తుండటంతో ఆశావహులు ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారు. నామినేషన్ల దాఖలుకు మార్చ్ 5 తుది గడువు కావడంతో అభ్యర్థులెవరన్న ఆసక్తి ఇప్పుడు సర్వత్రా కనిపిస్తోంది.ప్రస్తుత సభ్యుడు అభిషేక్ మను సింఘ్వీకి పార్టీ మరోసారి అవకాశం కల్పించడం ఖాయంగా కనిపిస్తోంది. సీనియర్ నేత అవడం, న్యాయవాదిగా సుప్రీంకోర్టులో పార్టీ తరఫున అనేక కేసుల్లో వాదించిన సేవలు ఆయనకు అదనపు అర్హతలు. కే కేశవరావు రాజీనామా తర్వాత ఏర్పడిన రెండేళ్ల స్వల్పకాలం మాత్రమే ఆయనకు అవకాశం దక్కింది. అందువల్ల ఇప్పుడు సింఘ్వీ పునర్నియామకం కేవలం లాంఛనం మాత్రమే. అసెంబ్లీలో సంఖ్యా బలం పరంగా కాంగ్రెస్ పార్టీకి ఒక రాజ్యసభ సునాయాసంగా దక్కుతుంది. పార్టీకున్న 66 స్థానాలకు తోడు సీపీఐ సభ్యుడు బలంతో పార్టీకి 67 స్థానాల బలముంది. 40 మంది మొదటి ప్రాధాన్యత ఓట్లతో ఒక అభ్యర్థి గెలిస్తే రెండో అభ్యర్థి గెలుకోసం మిగిలిన 27 మందితో పాటు మరో 13 మంది మద్దతు అవసరం. రాజ్యసభ ఎన్నిక కేంద్ర ఎన్నికల కమిషన్ పరిధిలో సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో జరుగుతుంది కాబట్టి పార్టీలు ఇచ్చే విప్ చెల్లదు. కాబట్టి ఇతరపార్టీల అభ్యర్థులు కూడా తమకు ఓటేస్తారని వ్యూహంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. ఆలెక్కన బీఆరెస్ కు దూరంగా వుంటున్న రెబల్ ఎమ్మెల్యేలు కూడాతమకే ఓటేస్తే కాంగ్రెస్ విజయం నల్లేరుపై నడకే అవుతుంది. బీఆరెస్ ఒకవేళ పోటీ కి తమ అభ్యర్థిని బరిలోకి దింపినా బీజేపీ, ఎంఐఎంలు తటస్థాగా వుండే అవకాశాలే ఎక్కువ. కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందనుకుంటున్న ఆరెండో రాజ్య సభ స్థానానికి అభ్యర్థి ఎవరనేది ఇప్పుడు పార్టీ వర్గాల్లో పెద్ద చర్చ. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని బరిలో నిలిపేందుకు రేవంత్ రెడ్డి నిర్ణయించుకున్నారని సమాచారం. ఇండియా కూటమి అభ్యర్థిగా ఉపరాష్ట్రపతి పదవికి ఆయన పోటీలో నిలవడం, తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర సమర్థకులు కూడా ఐనందున ఆయన పోటీకి పెద్దగా అభ్యంతరాలుండవని సీఎం వ్యూహం. ఆకోనంలో బీఆరెస్ కూడా ఆయన్ను వ్యక్తిగతంగా వ్యతిరేకించే అవకాశాలు తక్కువ. బీఆరెస్ రెబల్స్ కి తద్వారా ఓ కారణం చూపుకునే అవకాశం కూడా దొరుకుతుంది.పార్టీలో చాలాకాలంగా అవకాశం కోసం ఎదురుచూస్తున్న సీనియర్లు వీ. హనుమంతరావు, మధు యాష్కి గౌడ్, జీవన్ రెడ్డి లు తమకు అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి తమవంతు కృషిచేసామని ఇప్పుడైనా తమను గుర్తించాలని హైకమాండ్ ను కన్విన్స్ చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డికి రాజ్యసభ అవకాశం ఇవ్వడం ద్వారా ఢిల్లీలో తన పట్టు మరింత పెంచుకునే అవకాశం ఎక్కువగానే కనిపిస్తుంది. కే. కేశవరావు కూడా తన రెండేళ్ల రాజ్యసభ పదవీకాలాన్ని సిఘ్వీకోసం త్యాగం చేసినందున ఇప్పుడు తనకు మరో అవకాశం ఇస్తరన్న అంచనాలో వున్నట్టు తెలుస్తోంది. వీరెవరికీ కాదు పార్టీ సామాజిక కోణంలో ఆలోచిస్తే మైనారిటి కోటాలో తనకు అవకాశం వస్తుందని షబ్బీర్ అలీ, ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఆలంపూర్ మాజీ ఎమ్మెల్యే, జాతీయ కార్యదర్శిగా పనిచేసిన సంపత్, ఎస్టీ సామాజిక వర్గంనుంచి జాతీయ స్థాయిలో పార్టీ తరఫున గిరిజన వర్గాల కార్యకలాపాల్లో క్రియాశీలకంగా పనిచేసిన బెలయ్య నాయక్ కి అవకాశం ఇస్తారన్న అంచనాల్లో ఆయా అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

చూడాలి పార్టీ ఎవరికి అవకాశం ఇస్తుందో.

# కాంగ్రెస్ లో చేరికలు

మందమర్రి ఫిబ్రవరి 28,

మంత్రి వివేక్ వెంకటస్వామి సమక్షంలో చెన్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వారు పార్టీలో చేరినట్లు తెలిపారు.

సుద్దాల గ్రామ సర్పంచ్ డొంగిరి స్వప్న ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరిక కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి కొత్తగా చేరిన కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాల లబ్ధి చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

# మహానగర పాలనలో 'విభజన' ముసురు!

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (భారత శక్తి) : తెలంగాణ రాజధాని నగరం భాగ్యనగర పాలనలో పెను మార్పులు చోటుచేసుకుంటున్న తరుణంలో, జీహెచ్ఎంసీ (GHMC) ఉద్యోగుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ఏళ్ల తరబడి కష్టపడి దాచుకున్న సీపీఎస్ (CPS) నిధులు వ్యక్తిగత ఖాతాల్లో కనిపించకపోవడం ఒకవైపైతే.. నగరాన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించే ప్రక్రియలో తమ ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా 'బలవంతపు బదిలీలు' చేస్తుండటంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, శనివారం భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ (BMS) ప్రతినిధులు, ఎం రాధాకృష్ణ, టి కృష్ణ, శ్రీధర్ గౌడ్ బృందం ప్రత్యేక అధికారిని కలిసి ఈ సమస్యలపై సుదీర్ఘ వినతిపత్రం సమర్పించారు.

**జీతాల్లో కోత.. ఖాతాల్లో సున్నా!**

2004 తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగుల వేతనాల నుంచి ప్రతి నెలా సీపీఎస్/ఎన్‌పీఎస్ కింద ప్రభుత్వం నిర్ణీత మొత్తాన్ని మినహాయిస్తోంది. అయితే, ఈ సొమ్ము ఉద్యోగుల వ్యక్తిగత ప్రాన్ (PRAN) ఖాతాల్లో మాత్రం ప్రతిబింబించడం లేదు. "జీతంలో కోత పడుతోంది కానీ, అది ఎటు వెళ్తుందో తెలియడం లేదు. ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన నిధులు కూడా జమ కావడం లేదు" అని యూనియన్ జనరల్ సెక్రటరీ టి. కృష్ణ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం. రాధాకృష్ణ వాపోయారు. దీనివల్ల రిటైర్మెంట్ తర్వాత తమ పరిస్థితి ఏంటని సిబ్బంది గందరగోళంలో ఉన్నారు. 2004 నుంచి ఇప్పటి వరకు జరిగిన మినహాయింపులపై స్పష్టమైన, సరిచూసిన (Reconciled) స్టేట్‌మెంట్లను తక్షణమే అందజేయాలని వారు డిమాండ్ చేశారు.

**బలవంతపు బదిలీలపై సెగ:**

అడ్మినిస్ట్రేటివ్ సౌలభ్యం పేరుతో జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా (జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి) విడగొడుతున్న అధికారులు, ఉద్యోగుల స్థానికతను, నివాస ప్రాంతాలను పూర్తిగా విస్మరిస్తున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఎంసీహెచ్ నుంచి జీహెచ్ఎంసీగా మారినప్పుడు అనుసరించిన ప్రజాస్వామ్య పద్ధతులను పక్కనబెట్టి, ప్రస్తుతం కొంతమంది అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని యూనియన్ మండిపడింది.

**ప్రధాన అభ్యంతరాలు ఇవే:**

కోర్టులో ఉండగానే హడావుడి: విభజనపై కోర్టులో పిల్ (PIL) విచారణలో ఉండగానే, సిబ్బంది కేటాయింపులు పూర్తి చేయడంలో అధికారుల అంతర్యం ఏమిటని యూనియన్ సీనియర్ నాయకులు శ్రీధర్ ప్రశ్నించారు.

**చర్చలకు నో.. సంతకాలకే మొగ్గు:**

కీలకమైన యూనియన్లతో చర్చించకుండా, కేవలం స్వచ్ఛ ఆటో సభ్యులతో సమావేశమై అంతా సవ్యంగా ఉందన్నట్లు అధికారులు చిత్రీకరించడంపై యూనియన్ వైస్ ప్రెసిడెంట్ బిక్షపతి, నాయకులు భుజేందర్, గణేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 20న జరిగిన సమావేశంలో ఉద్యోగ సంఘాల అభిప్రాయాలు తీసుకోకుండా కేవలం అటెండెన్స్ షీట్‌పై సంతకాలు తీసుకోవడమేంటని వారు నిలదీశారు.

**యూనియన్ డిమాండ్లు:**

* స్థానికతకే పీఠం: ఉద్యోగులు నివసించే ప్రాంతం ఆధారంగానే వారిని ఆయా కార్పొరేషన్లకు కేటాయించాలి.
* స్వచ్ఛంద బదిలీ: కొత్త కార్పొరేషన్లకు వెళ్లడానికి ఆసక్తి చూపే వారికే ప్రాధాన్యత ఇవ్వాలి.
* సమ్మతి తప్పనిసరి: ఉద్యోగి సమ్మతి పత్రం (Consent) లేకుండా ఏకపక్షంగా బదిలీ చేయకూడదు.

ఈ సమస్యలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించకపోతే ఉధృతమైన ఉద్యోగ నిరసన తప్పదని యూనియన్ జనరల్ సెక్రటరీ టి. కృష్ణ హెచ్చరించారు. పారదర్శకమైన విభజన ప్రక్రియతో పాటు, తమ సీపీఎస్ నిధులకు భద్రత కల్పించాలని మహానగర కార్మికులు, అధికారులు డిమాండ్ చేస్తున్నారు.



# మాది ఉద్యోగుల పక్షపాతి ప్రభుత్వం

: **మంత్రి సీతక్క**

* **పంచాయతీ కార్యదర్శుల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ**
* **జీవో 317 బాధితులకు ఊరట.. స్పోర్ట్స్ కోటా ఉద్యోగుల పునర్నియామకం**
* **ప్రజా భవన్‌లో ఘనంగా నిర్వహించిన సెంట్రల్ ఫోరం ప్రతినిధులు**

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (భారత శక్తి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారంలో సానుకూల దృక్పథంతో పనిచేస్తోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) స్పష్టం చేశారు. శనివారం నాడు హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ సెంట్రల్ ఫోరం (TPSCF) రూపొందించిన 2026 నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల సమగ్ర అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర వెలకట్టలేనిదని ప్రశంసించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఉద్యోగులు వారధిలా ఉండి సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి చేరవేయాలని పిలుపునిచ్చారు.

**ఉద్యోగుల సమస్యలపై కీలక నిర్ణయాలు:**

ప్రభుత్వ ఉద్యోగుల చిరకాల కోరికలను నెరవేరుస్తున్నామని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రధానంగా:

* హెల్త్ కార్డులు: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ త్వరలోనే హెల్త్ కార్డులు అందజేస్తామని హామీ ఇచ్చారు.
* జీవో 317 బాధితులకు న్యాయం: జీవో నెం.317 వల్ల స్థానికత కోల్పోయి ఇబ్బందులు పడుతున్న 223 మంది పంచాయతీ కార్యదర్శులకు రెండేళ్ల పాటు అంతర్ జిల్లా డిప్యూటేషన్‌పై నియామకానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపిందని వెల్లడించారు.
* స్పోర్ట్స్ కోటా పునరుద్ధరణ: గతంలో తొలగించిన స్పోర్ట్స్ కోటా పంచాయతీ కార్యదర్శులను తిరిగి విధుల్లోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు.

**మంత్రికి కృతజ్ఞతల జల్లు:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి అని TPSCF రాష్ట్ర అధ్యక్షుడు సందిల బలరాం కొనియాడారు. తమ సమస్యలపై మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ చూపడం పట్ల TGEJAC చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ తదితరులు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఫోరం ప్రతినిధులు వెంకటరమణ, రఫీ, ఇంద్రసేనారెడ్డి, రమాదేవి, బాల్ రాజ్ తో పాటు సిద్దిపేట, నాగర్ కర్నూల్, వరంగల్, మెదక్ సహా పలు జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు మురళీ, విద్యావికాస్ రెడ్డి, గోదా రాజు, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.



# చెరువుల పరిరక్షణకు 'హైడ్రా' ఫోన్-ఇన్





: **28 ఫిర్యాదులు**

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (భారత శక్తి) : నగరంలోని చెరువులు, నాలాల పరిరక్షణే ధ్యేయంగా శనివారం నిర్వహించిన 'హైడ్రా' ఫోన్ఇన్ కార్యక్రమానికి ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. గంట వ్యవధిలోనే మొత్తం 28 ఫిర్యాదులు అందాయి. ప్రధానంగా గుర్రపుడెక్క విస్తరణ, దోమల బెడద, మురుగునీరు చేరడం మరియు ఎఫ్‌టీఎల్ (FTL) పరిధిలో అక్రమ నిర్మాణాలపై నగరవాసులు కమిషనర్ రంగనాథ్‌కు విన్నవించారు.

**ప్రధాన ఫిర్యాదులు - విజ్ఞప్తులు:**

* రామంతాపూర్: చిన్న చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో జరుగుతున్న నిర్మాణాలను అడ్డుకోవాలని స్థానికులు కోరారు.
* బాచుపల్లి: సర్వే నంబరు 54లోని 3 ఎకరాల నిషేధిత భూమిని ప్రజావసరాలకు కేటాయించాలని విన్నవించారు.
* అల్వాల్ జొన్నబండ: వజ్ర ఎన్‌క్లేవ్‌లో పార్కుల ఆక్రమణలు, రహదారి అడ్డంకులను తొలగించాలని కోరారు.
* నిజాంపేట: పత్తికుంట చెరువును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.
* ఎల్బీనగర్: వాంబే గృహ సముదాయాల్లో పార్కింగ్ స్థలాలను ఆక్రమించి అదనపు గదులు నిర్మిస్తున్నారని ఫిర్యాదు చేశారు.
* బోయిన్ పల్లి: ఓల్డ్ బోయిన్ పల్లి చెరువులో గుర్రపుడెక్కను తొలగించాలని, పురావస్తు శాఖ భూముల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

* **ఫిర్యాదులపై స్పందించిన కమిషనర్ రంగనాథ్..**

క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మురుగునీరు చెరువుల్లో కలవకుండా ఎస్‌టీపీలు (STP) ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

మేడికుంట ఆక్రమణల తొలగింపు

* బాచుపల్లి: బాచుపల్లిలోని మేడికుంట చెరువు ఆక్రమణలపై హైడ్రా కొరడా ఝుళిపించింది.

21 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువు, ఆక్రమణల కారణంగా 18 ఎకరాలకు తగ్గిపోయింది. తాజాగా ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్రధాన రహదారి వైపు వెలిసిన 10 దుకాణాలను అధికారులు శనివారం తొలగించారు.

చెరువు ఒడ్డున మాంసం వ్యర్థాలను వేస్తూ కలుషితం చేస్తున్నారన్న ఫిర్యాదుతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి హైడ్రా తనిఖీలు చేపట్టింది. వ్యర్థాలను తొలగించిన అనంతరం, భవిష్యత్తులో ఆక్రమణలు జరగకుండా 10 మీటర్ల ఎత్తులో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో వాకింగ్ ట్రాక్ నిర్మించేందుకు మున్సిపల్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



## లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో

# కల్వకుంట్ల కవిత ప్రత్యేక పూజలు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (భారత శక్తి) : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శనివారం బీహెచ్ఈఎల్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. లిక్కర్ కేసులో భారీ ఊరట లభించిన నేపథ్యంలో ఆలయానికి చేరుకున్నట్లు తెలుస్తుంది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ వర్గాలు ఆమెకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. తెలంగాణ అభివృద్ధి, మహిళా శక్తీకరణ, సాంస్కృతిక పరిరక్షణకు ఆశీస్సులు ప్రసాదించాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులతో ఆమె ముచ్చటించారు. ఆధ్యాత్మికత మనసుకు శాంతినిచ్చి సమాజంలో సత్సంకల్పాలను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. సంప్రదాయాలు, సాంస్కృతిక విలువలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీహెచ్ఎంసీ వార్తలు: ఆదివారాల్లో 'ఆస్తి పన్ను' పరిష్కార వేదిక




హైదరాబాద్, ఫిబ్రవరి 28 (భారత శక్తి) : నగర పౌరుల ఆస్తి పన్ను సంబంధిత సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు జీహెచ్ఎంసీ ప్రత్యేక కార్యాచరణ ప్రకటించింది. మార్చి నెలలోని అన్ని ఆదివారాల్లో (మార్చి 1, 8, 15, 22, 29 తేదీల్లో) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అన్ని సర్కిల్ కార్యాలయాల్లో 'ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం' (PTP) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. ఈ ప్రత్యేక వేదిక ద్వారా రివిజన్ పిటిషన్లు, పన్ను అంచనాల సవరణలు, ఆన్‌లైన్ చెల్లింపుల నమోదు, బకాయిల సవరణ వంటి అంశాలను అధికారులు అక్కడికక్కడే పరిశీలించి పరిష్కరిస్తారు. ప్రతి కేంద్రంలో కంప్యూటర్లు, ప్రింటర్లతో కూడిన మూడు ప్రత్యేక కౌంటర్లు, పౌరులకు మార్గదర్శనం చేసేందుకు రిసెప్షన్ కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు.

**వడ్డీలో 90 శాతం రాయితీ:**

పాత బకాయిలు ఉన్నవారి కోసం ప్రభుత్వం 'వన్ టైమ్ సెటిల్మెంట్' (OTS) పథకాన్ని 202526 ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిందని కమిషనర్ పేర్కొన్నారు. ఈ పథకం కింద వడ్డీపై 90 శాతం రాయితీ లభిస్తుందని, పౌరులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



* **నిబంధనలు ఉల్లంఘించిన హోటళ్లకు నోటీసులు:**

సికింద్రాబాద్ జోన్ పరిధిలోని ఆహార విక్రయ కేంద్రాలు, హోటళ్లపై జీహెచ్ఎంసీ అధికారులు శనివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. కవాడిగూడలోని అమంత్రన్ హోటల్, సమోసా ఖార్ఖానా ప్రాంగణాల్లో అపరిశుభ్రత, గడువు ముగిసిన ఆహార పదార్థాల నిల్వ, అనుమతి లేని ఫుడ్ కలర్స్ వినియోగాన్ని గుర్తించిన అధికారులు.. సదరు యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. ఆహార నాణ్యత విషయంలో రాజీ పడితే చట్టపరమైన చర్యలు తప్పవని జోనల్ కమిషనర్ మంగతాయారు స్పష్టం చేశారు.

* **12 మంది జీహెచ్ఎంసీ ఉద్యోగుల పదవీ విరమణ**

జీహెచ్ఎంసీ పురోగతిలో ఉద్యోగుల సేవలు అభినందనీయమని అదనపు కమిషనర్ సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం ప్రధాన కార్యాలయంలో పదవీ విరమణ పొందిన 12 మంది అధికారులను, ఉద్యోగులను ఆయన ఘనంగా సత్కరించారు. నిబద్ధతతో పనిచేసిన వీరి కృషి సహచరులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ జయంత్, ఏఎంసీ శారద తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా నారాయణ పాఠశాల సైన్స్ ప్రదర్శన

హైదరాబాద్, ఫిబ్రవరి 28: (భారతి శక్తి) : నారాయణ పాఠశాలలో సైన్స్ అద్భుతాలను అన్వేషించడం సైన్స్ మన చుట్టూ ఉంది! అన్నింటినీ తయారు చేసే చిన్న అణువుల నుండి విశాల విశ్వం వరకు, సైన్స్ గురించి నేర్చుకోవడం ప్రపంచాన్ని బాగా అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. హస్తినాపురంలోని నారాయణ స్కూల్‌లో, ప్రీ ప్రైమరీ నుండి హైస్కూల్ వరకు విద్యార్థులు సరదాగా ప్రయోగాలు, సృజనాత్మక ప్రాజెక్టులు మరియు ఉత్తేజకరమైన ఆవిష్కరణల ద్వారా సైన్స్‌ను చురుకుగా అన్వేషిస్తున్నారు.





**మా లిటిల్ ఎక్స్‌ప్లోరర్స్ కోసం సైన్స్**

ప్రీప్రైమరీ విద్యార్థులకు, విజ్ఞాన శాస్త్రాన్ని ఆటల కార్యకలాపాల ద్వారా పరిచయం చేస్తారు. మొక్కలు పెరగడం, అయస్కాంతాలతో ఆడుకోవడం మరియు రంగులు కలపడం వంటివి పిల్లలు ప్రకృతి మరియు రోజువారీ దృగ్విషయాల పట్ల ఉత్సుకతను పెంపొందించడానికి సహాయపడతాయి. కథలు మరియు ప్రయోగాల ద్వారా నేర్చుకోవడం విజ్ఞాన శాస్త్రాన్ని సరదాగా మరియు ఉత్తేజపరుస్తుంది!

**యంగ్ సైంటిస్ట్స్ ఇన్ యాక్షన్**

ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బేకింగ్ సోడాతో అగ్నిపర్వతాలను తయారు చేయడం, తేలియాడే మరియు మునిగిపోయే వస్తువులతో తేలికను అర్థం చేసుకోవడం మరియు సృజనాత్మక నమూనాలతో సౌర వ్యవస్థను అన్వేషించడం వంటి ప్రయోగాలలో పాల్గొంటారు. ఈ కార్యకలాపాలు వారికి ప్రశ్నలు అడగడం, విమర్శనాత్మకంగా ఆలోచించడం మరియు సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయపడతాయి.

**మిడిల్ స్కూల్ ఇన్నోవేటర్లు**

విద్యార్థులు పెరుగుతున్న కొద్దీ, వారు సైన్స్ ఫెయిర్‌లు, రోబోటిక్స్ క్లబ్‌లు మరియు కోడింగ్ వర్క్‌షాప్‌లలో పాల్గొంటారు. వారు ఆకర్షణీయమైన ప్రాజెక్ట్‌ల ద్వారా విద్యుత్, సాధారణ యంత్రాలు మరియు మానవ శరీర నిర్మాణ శాస్త్రాన్ని అన్వేషిస్తారు. హ్యాండ్‌ఆన్ లెర్నింగ్ వారికి సైద్ధాంతిక భావనలను నిజ జీవిత అనువర్తనాలతో అనుసంధానించడంలో సహాయపడుతుంది, ఇది ఆవిష్కరణపై ఆసక్తిని రేకెత్తిస్తుంది.

*** ఉన్నత పాఠశాల: భవిష్యత్ శాస్త్రవేత్తలను సిద్ధం చేస్తోంది**

ఉన్నత పాఠశాల విద్యార్థులకు, సైన్స్ మరింత వివరంగా మరియు ప్రయోగాత్మకంగా మారుతుంది. ల్యాబ్ ప్రయోగాలు, పరిశోధన ప్రాజెక్టులు మరియు జాతీయ సైన్స్ పోటీలు విద్యార్థులను భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం మరియు జీవశాస్త్రం వంటి అంశాలలో లోతుగా డైవ్ చేయడానికి ప్రోత్సహిస్తాయి. సాంకేతికత మరియు స్థిరత్వం యొక్క భవిష్యత్తును అర్థం చేసుకోవడానికి విద్యార్థులు అంతరిక్ష శాస్త్రం, జన్యుశాస్త్రం, కృత్రిమ మేధస్సు మరియు పర్యావరణ పరిరక్షణను అన్వేషిస్తారు. ఈ ప్రయత్నానికి మా అంకితమైన ఆర్ అండ్ డీ హెడ్‌లు శివరంజిని, మహేశ్వరి మరియు మీనా, కోఆర్డినేటర్లు శరత్ బాబు, గాయత్రి, శిరీష, నారాయణ విద్యా సంస్థల జి ఎం గోపాల్ రెడ్డి గారు. దిల్సుక్ నగర్ డివిజన్ ఏ జి ఎం హేమాంబర్, ఆర్ ఐ రవి ప్రసాద్ మరియు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీ లక్ష్మి శారద, మరియు శ్రీ అనిల్ గారు. ఏ డి శ్రీదేవి వైస్ ప్రిన్సిపాల్ విజయ లక్ష్మి, ఈ కిడ్జ వైస్ ప్రిన్సిపాల్ శిల్పా, ఏ ఓ లు రాజేష్ మా విద్యార్థులకు అత్యుత్తమ శాస్త్రీయ అభ్యాస అనుభవాన్ని అందించడానికి అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. వారి మార్గదర్శకత్వం మరియు నాయకత్వం సైన్స్ రంగంలో రాణించటానికి యువ మనస్సులను ప్రేరేపిస్తూనే ఉన్నాయి.

# నిన్నటి వరకు ఒక లెక్క.. నేటి నుండి మరో లెక్క!

- **రాజకీయ కుట్రల కోటలు బద్ధలు.. లిక్కర్ కేసులో ధర్మమే గెలిచింది!**
- **అసత్యపు అస్త్రాలు తుత్తునియలు - క్లీన్ చిట్ తో బయటపడ్డ అసలు నిజం**
- **నిర్ణయాత్మక పోరాటం దిశగా 'సరికొత్త వ్యూహం' - కప్పాటి పాండురంగారెడ్డి.**



హైదరాబాద్, ఫిబ్రవరి 28 (భారత శక్తి): "బురద చల్లడమే పనిగా పెట్టుకున్న రాజకీయ ప్రత్యర్థులకు కాలం చెల్లింది. అబద్ధాల పునాదులపై నిర్మించిన కుట్రల సౌధం కుప్పకూలిపోయింది" అని ప్రముఖ నాయకులు కప్పాటి పాండురంగారెడ్డి ధ్వజమెత్తారు. లిక్కర్ స్కాం అనేది కేవలం రాజకీయ ప్రేరేపిత కక్షసాధింపు చర్య అని న్యాయస్థానం తేల్చిచెప్పడంతో సత్యం బహిర్గతమైందని ఆయన స్పష్టం చేశారు. నిన్నటి వరకు హేళన చేసిన నోళ్లకు ఈ తీర్పు చెంపపెట్టు అని ఆయన విమర్శించారు.

*** అభాండాల పర్వం.. అపహాస్యాల ముగింపు:**

గత కొంతకాలంగా తమను రాజకీయంగా దెబ్బతీయడానికి 'లిక్కర్ కేసు'ను ఒక బ్రహ్మాస్త్రంలా వాడుకున్నారని పాండురంగారెడ్డి మండిపడ్డారు. ఏ చర్చ జరిగినా, ఏ వేదికపైనైనా ఈ నిరాధారమైన ఆరోపణలను సాకుగా చూపి అపహాస్యం చేసే ప్రయత్నం చేశారని, ఎంత నిజాయితీగా ఉన్నా రాజకీయంగా ఎదుర్కోలేక అప్రతిష్ఠ పాలు చేయాలని కుట్రలు పన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదని, ఇప్పుడు రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయిందని, అంతా పాజిటివ్ వైబ్ నెలకొందని ధీమా వ్యక్తం చేశారు.

*** సమర శంఖం.. సరికొత్త వ్యూహం!**

"సత్యమేవ జయతే" అనేది కేవలం మాట కాదు, అది ఈ తీర్పుతో మరోసారి నిరూపితమైందని పాండురంగారెడ్డి అన్నారు. తమపై ఉన్న నెగెటివ్ నరేషన్ అంతమైందని, ఇకపై నిర్ణయాత్మక పోరాటం దిశగా అడుగులు వేస్తామని ప్రకటించారు. ప్రత్యర్థుల కుతంత్రాలను తిప్పికొడుతూ, ప్రజాక్షేత్రంలో సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతామని, ఈ విజయం తమ కార్యకర్తలకు కొండంత అండ అని ఆయన ఉద్ఘాటించారు.

# ఆస్తి పన్ను సమస్యల పరిష్కారానికి 'ఆదివారపు' వేదిక

- **శంషాబాద్ జోన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమం.. మార్చి 31లోపు పన్ను చెల్లించాలని విజ్ఞప్తి.**






శంషాబాద్, ఫిబ్రవరి 28 (భారత శక్తి) : ఆస్తి పన్నుకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలు, ఫిర్యాదులను పరిష్కరించేందుకు జీహెచ్‌ఎంసీ శంషాబాద్ జోనల్ కార్యాలయం నడుం బిగించింది. ప్రతి ఏటా నిర్వహించే 'ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం (PTP)' కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా మార్చి నెలలోని అన్ని ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు జోనల్ అధికారులు ప్రకటించారు.

**ముఖ్య వివరాలు:**

- వేదిక: సంబంధిత డిప్యూటీ కమిషనర్ల కార్యాలయాలు.
- సమయం: ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు.
- తేదీలు: మార్చి 1, 8, 15, 22 మరియు 29.
- పరిధి: ఆదిబట్ల (సర్కిల్ 15), బడంగ్‌పేట (16), జలపల్లి (17), శంషాబాద్ (18).



**పరిష్కారమయ్యే అంశాలు:**

ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా పన్ను చెల్లింపుదారులు కింది సమస్యలను పరిష్కరించుకోవచ్చు:

- సవరణలు: ఆస్తి పన్ను అంచనాల సవరణలు, ఆన్‌లైన్ బకాయిల సరిదిద్దడం.
- పిటిషన్లు: రివిజన్ పిటిషన్ల పరిష్కారం, స్వీయ అంచనా (Self Assessment) లోని లోపాలు.
- నమోదు: బిల్ కలెక్టర్ల వద్ద లేదా RTGS ద్వారా చెల్లించిన మొత్తాలు ఆన్‌లైన్‌లో ప్రతిబింబించకపోతే వాటి నమోదు.
- ఇతరాలు: ఐజీఆర్ఎస్ (IGRS) సమస్యలు, కోర్టు కేసులు మరియు సాధారణ ఫిర్యాదులు.

**గడువులోపు చెల్లించకుంటే చిక్కులే!**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202526) ముగింపునకు చేరువలో ఉండటంతో, పన్ను వసూళ్లపై యంత్రాంగం దృష్టి సారించింది. మార్చి 31 లోపు పన్ను చెల్లించని పక్షంలో తదుపరి కాలానికి అదనపు భారం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా వాణిజ్య సముదాయాలు, నివాస గృహాల యజమానులు తమ పెండింగ్ బకాయిలను వెంటనే క్లియర్ చేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఆదివారాల్లో నిర్వహించే ఈ కేంద్రాల ద్వారా ప్రజలకు కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ తప్పుతుంది. శంషాబాద్ జోన్ పరిధిలోని ఆస్తి యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, వివాద రహితంగా పన్ను ప్రక్రియను పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ యంత్రాంగం కోరింది.



# నాదర్‌గుల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం

- **పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి**

బడంగ్‌పేట, ఫిబ్రవరి 28 (భారత శక్తి) : మహేశ్వరం నియోజకవర్గం నాదర్‌గుల్ డివిజన్ పరిధిలోని జయసూర్య పట్నం కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ప్రగతి మహిళ సామాజిక సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరంలో కాలనీ వాసులకు, ముఖ్యంగా మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, 2D ఎకో, కంటి మరియు పంటి పరీక్షలను నిపుణులైన వైద్యులు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా ఇలాంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఆరోగ్య పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బంగారి అశోక్, డివిజన్ కోఆర్డినేటర్ వెంకటేష్ గౌడ్, నర్సింగ్, గడ్డం మాధవరెడ్డి, నాగరాజు, కాలనీ అధ్యక్షుడు సాయిబాబు పాల్గొన్నారు. అలాగే వైద్య శిబిరం నిర్వాహకులు శ్రీలత రాణి, సేవా సంస్థ అధ్యక్షురాలు సుధారాణి, వైద్య సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో మహిళలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

# హయత్నగర్ టౌన్ ప్లానింగ్.. 'పర్మిషన్' ఇక్కట్లే!

- **డీసీ వర్సెస్ ఏసీపీ: అధికారుల మధ్య సమన్వయ లోపం**
- **లక్షల ఫీజు కట్టినా కదలని వైనం.. సామాన్యుల పాలిట 'శాపం'**




హయత్నగర్, ఫిబ్రవరి 28 (భారత శక్తి) : హయత్నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం ప్రస్తుతం వివాదాలకు నిలయంగా మారింది. నిబంధనల ప్రకారం జరగాల్సిన పనులు అధికారుల ఆధిపత్య పోరులో నలిగిపోతున్నాయి. ముఖ్యంగా డిప్యూటీ కమిషనర్ (DC) వంశీకృష్ణ వ్యవహారశైలితో అటు క్షేత్రస్థాయి అధికారులు, ఇటు సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వానికి లక్షలాది రూపాయల ఫీజులు చెల్లించినా, అనుమతుల కోసం నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోంది.

*** అధికార దర్పం.. ఫైళ్ల తిరస్కరణే పనిగా!**

టౌన్ ప్లానింగ్ విభాగంలో టీపీఎస్ (TPS), ఏసీపీ (ACP) స్థాయి అధికారులు సాంకేతికంగా పరిశీలించి క్లియర్ చేసిన ఫైళ్లను కూడా డిప్యూటీ కమిషనర్ కావాలనే అడ్డుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అత్యంత స్వల్ప కారణాలను (Silly rea sons) సాకుగా చూపిస్తూ ఫైళ్లను వెనక్కి పంపుతుండటంతో ప్రక్రియ మొత్తం స్తంభించిపోయింది.

- నిబంధన ఏంచెబుతోంది?: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో అనుమతులు రావాలి.
- క్షేత్రస్థాయి పరిస్థితి: నెలలు గడుస్తున్నా ఆఫీసుల చుట్టూ తిరగడమే సరిపోతోంది.

*** సమన్వయం సున్నా.. గందరగోళం పరాకాష్ట**

ఒక ఫైలు విషయంలో సందేహాలు ఉంటే సంబంధిత ఏసీపీని పిలిచి చర్చించాల్సింది పోయి, పదేపదే రిటర్న్ చేయడం ద్వారా డిప్యూటీ కమిషనర్ తన అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని బాధితులు వాపోతున్నారు. ఒక్కో ఫైలును ఐదు నుంచి పదిసార్లు తిప్పడం వల్ల పని భారం పెరిగి టౌన్ ప్లానింగ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. డీసీ వైఖరి వల్ల అధికారుల మధ్య సమన్వయం లోపించి, ప్రజలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.

*** కాసుల కక్కుర్తే కారణమా?**

ప్రభుత్వానికి చెల్లించే అధికారిక రుసుములే కాకుండా, అధికారులకు 'అడిగినంత' ఇచ్చుకుంటేనే ఫైళ్లు కదులుతున్నాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. డిప్యూటీ కమిషనర్ తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని కావాలనే జాప్యం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "డబ్బులు కట్టినా అనుమతులు రాకపోతే సామాన్యులు ఎక్కడికి వెళ్లాలి?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

*** ఇప్పటికైనా స్పందించేనా?**

ఉన్నతాధికారులు వెంటనే స్పందించి హయత్నగర్ సర్కిల్‌లో నెలకొన్న ఈ ప్రతిష్టంభనను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. సమన్వయ లోపాన్ని సరిదిద్ది, అవినీతికి తావులేకుండా సకాలంలో బిల్డింగ్ పర్మిషన్లు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# భారత్‌లో చారిత్రాత్మక మార్పు.. 2070 నాటికి నెట్ జీరో టార్గెట్ : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైద్రాబాద్, ఫిబ్రవరి 28 (భారత శక్తి) : ప్రధాని మోడీ నాయకత్వంలో భారత్‌లో చారిత్రాత్మక మార్పు వచ్చిందని, పారదర్శకమైన సాంకేతిక ఆధారిత పరిపాలన అందిస్తూ కొత్త ప్రమాణాలతో ముందుకు సాగుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. భారత్ 2070 నాటికి నెట్ జీరో లక్ష్యాన్ని సాధించాలనే సంకల్పంతో కేంద్రం ఉందని, ఈ ప్రయాణంలో డీప్ టెక్నాలజీ ఎంతో కీలకంగా మారుతుందన్నారు. ఏఐ వినియోగం, క్లీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, కార్బన్ క్యాప్చర్, క్వాంటం టెక్నాలజీ వంటి రంగాల్లో ఆవిష్కరణలు అత్యంత అవసరమని తెలిపారు. శనివారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన విజ్ఞాన్ వైభవ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. సీవీ రామన్ ప్రపంచానికి రామన్ ఎఫెక్ట్‌ను పరిచయం చేసినప్పుడు, భారత్ బ్రిటిష్ పాలనలో ఉన్నప్పటికీ, మేధోశక్తి విషయంలో భారత్ ఒక స్వతంత్ర దేశమని ఎప్పటికీ అలాగే నిలుస్తుందని నిరూపించారు. నేడు విజ్ఞాన రంగంలో భారతదేశంపై చేయి సాధించిన విషయం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఇటీవల గ్లోబల్ టెక్నాలజీ సదస్సులో ప్రతినిధులంతా భారతదేశ విస్తృత స్థాయి, ప్రతిభ, భవిష్యత్తు గురించి చర్చించుకున్నారని, ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక అభివృద్ధి భారత్ భాగస్వామ్యంలోనే ముందుకు సాగుతుందనే విషయాన్ని వారు గుర్తించారు. గత 11 ఏళ్లలో భారతదేశం విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో ఒక శక్తిమంతంగా నిలిచిందని ప్రశంసలు కురిపించినట్లు తెలిపారు.

**ప్రజలకు ఆహారం అందించడం కష్టం!**

విజ్ఞానం అనేది లేకుండా 1.4 బిలియన్ ప్రజలకు ఆహారం అందించడం కష్టం అని కేంద్ర మంత్రి అన్నారు. పరిశోధనలు లేకుండా రక్షణ రంగం మన సరిహద్దులను కాపాడలేం.. ఆవిష్కరణలు లేకుండా పరిశ్రమలు ప్రపంచ స్థాయిలో పోటీ పడలేమన్నారు. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థలోని అన్ని పిల్లర్లు శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ఇంజినీర్లు, ఆవిష్కర్తల భుజాలపై ఆధారపడి ఉన్నాయని, అంతరిక్షంలోకి మనం పంపిన అనేక మిషన్లు ప్రపంచానికి ప్రేరణగా నిలుస్తున్నాయి.. మన ఔషధ, వ్యాక్సిన్ సామర్థ్యాలు మానవాళికి సేవ చేయగలవని నిరూపించాయి.. వికసిత భారత్ 2047 లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఈ ప్రయాణంలో విజ్ఞానం, సాంకేతికతే మన భవిష్యత్తును నిర్ణయించనున్నాయి..

# క్యాన్సర్ రహిత సమాజమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని జోడు గుర్రాల్లా పరుగులు పెట్టిస్తున్నామని, ప్రజారోగ్యానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం రావివలసలో శనివారం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం జరిగిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడుతూ... క్యాన్సర్ రహిత సమాజమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామన్నారు. మహిళల్లో అత్యధికంగా వస్తున్న సర్వైకల్ క్యాన్సర్‌ను అరికట్టేందుకు 15 ఏళ్లలోపు బాలికలకు హెచ్‌పీవీ టీకాలను ఉచితంగా అందిస్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. బయట మార్కెట్లో రూ.4 వేలు ఉండే ఈ టీకాను, రాష్ట్రంలోని 3.45 లక్షల మంది బాలికలకు ఉచితంగా అందించేందుకు రూ.14.11 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. కర్నూలులో రూ.50 కోట్లతో స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేస్తున్నామని, తాజా బడ్జెట్‌లో వైద్య రంగానికి



ఏకంగా రూ.19,305 కోట్లు కేటాయించామని తెలిపారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సీఎం కీలక ప్రకటన చేశారు. రాబోయే మూడేళ్లలో ఉత్తరాంధ్రలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి, ప్రతి ఎకరానికి నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్, విశాఖలో డేటా సెంటర్ల రాకతో ఈ ప్రాంత ముఖచిత్రం మారిపోనుందని చెప్పారు. గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గత పాలకులు ప్రజలనే కాకుండా దేవుడిని కూడా మోసం చేశారని, తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడి అపచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా భూములు కాజేయాలని చూస్తే, తాము అధికారంలోకి రాగానే ఆ చట్టాన్ని రద్దు చేసి ప్రజలకు భరోసా కల్పించామని గుర్తుచేశారు. సమపాళ్లలో అభివృద్ధి, సంక్షేమం అందిస్తూ 'హెల్తీ, వెల్తీ, హ్యాపీ' ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే ఎన్డీఏ కూటమి లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

## జలమండలికి శారదా పీఠం భూముల కేటాయింపు

కోకాపేటలోని శారదా పీఠానికి కేటాయించిన భూమికి సంబంధించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. శారదా పీఠానికి కేటాయించిన ఈ భూముల్లో జలమండలి నిర్మాణ పనులు చేపట్టవద్దని ఆదేశించారు. జలమండలికి శారదా పీఠం భూముల కేటాయింపు తక్షణమే రద్దు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శారదా పీఠం భూములను జలమండలికి కేటాయించడంతో అక్కడ నిర్మాణ పనులు చేపట్టారు. జలమండలి నిర్మాణ పనులను శారదా పీఠం ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, అధికారులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. పీఠం భూములను జలమండలికి కేటాయించిన సమయంలో అక్కడి నిర్మాణాల స్థితిని తెలియజేయకపోవడాన్ని ప్రశ్నించారు. జలమండలికి ఈ భూకేటాయింపులను రద్దు చేసి, శారదా పీఠానికే ఆ భూములు కొనసాగేలా ఆదేశించారు.

### ఇరాన్ ఉద్రిక్తతలు...

## దుబాయ్ ఎయిర్ పోర్టులో చిక్కుకుపోయిన సింధు...

రెండు సార్లు ఒలింపిక్ మెడల్ సాధించిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు ప్రయాణంలో ఊహించని అనుభవం ఎదురైంది. శనివారం ఆమె దుబాయ్ ఎయిర్‌పోర్టులో చిక్కుకుపోయింది. ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఇంగ్లాండ్‌లోని బర్మింగ్‌హామ్ వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. అమెరికా, ఇజ్రాయెల్ మరియు ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరడంతో విమాన రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ట్రాన్సిట్ కోసం దుబాయ్ చేరిన సింధు అక్కడే ఆగిపోవాల్సి వచ్చింది. దీనికి సంబంధించి సింధు తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను పోస్ట్ చేసింది. ఎయిర్‌పోర్టు మొత్తం ప్రయాణికులతో కిక్కిరిసిపోవడం, తదుపరి అప్డేట్ కోసం అందరూ ఎదురుచూస్తుండటం ఆ వీడియోలో కనిపిస్తోంది. "తదుపరి ప్రకటన వచ్చేవరకు అన్ని విమానాలు రద్దు" అని సింధు పేర్కొంది. అంతేకాదు, ఆమె ఎక్స్ లోనూ తన స్పందన వెలిబుచ్చింది. "ప్రస్తుతం ఇక్కడ జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఏమీ అర్థం కావడం లేదు. నా కళ్ల ముందే ఆకాశంలో క్షిపణి దాడులు, పేలుళ్ల శబ్దాలు వింటుంటే వెన్నులో వణుకు పుడుతోంది. సోషల్ మీడియాలో, వార్తల్లో వస్తున్న భయానక వీడియోలు చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. దుబాయ్ అంటే నాకు ఎంతో ఇష్టం.. ఎప్పుడూ ప్రశాంతంగా, ఎంతో సేఫ్ గా ఉండే ఈ నగరంలో ఇలాంటి యుద్ధ వాతావరణం చూస్తానని కలలో కూడా అనుకోలేదు. ఇది నిజంగా నమ్మశక్యం కాని పరిస్థితి. నా క్షేమ సమాచారం కోసం ఆరా తీస్తూ మెసేజ్ లు చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మీ ప్రేమ నాకు కొండంత బలాన్ని ఇస్తోంది. ప్రస్తుతానికి నేను, నా టీమ్ సభ్యులు దుబాయ్ లోనే క్షేమంగా ఉన్నాం. కానీ ఇరాన్ యుద్ధం కారణంగా ఇక్కడ పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయి. మేం ప్రస్తుతం ఇక్కడే చిక్కుకుపోయాం. ఎయిర్ పోర్ట్ అంతా గందరగోళంగా, అల్లకల్లోలంగా ఉంది. ఎంతోమంది ప్రయాణికులు, చిన్న పిల్లలతో ఉన్న కుటుంబాలు ఎక్కడికి వెళ్లాలో తెలియక పడిగాపులు కాస్తున్నారు. మేం కూడా ఈ క్లిష్ట పరిస్థితి నుంచి ఎప్పుడు బయటపడతామా అని ఆశగా ఎదురుచూస్తున్నాం. మనం గడుపుతున్న సాధారణ జీవితం ఎంత చిన్నదో.. ఎంత అస్థిరమైనదో ఇలాంటి ఘటనలు చూసినప్పుడే మనసుకు తడుతుంది. ఈ విపత్కర పరిస్థితుల్లో ఇక్కడ చిక్కుకున్న ప్రతి ఒక్కరూ క్షేమంగా బయటపడాలని, త్వరలోనే ఇక్కడ శాంతి నెలకొనాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నా" అని తన ట్వీట్ లో పేర్కొంది. మరోవైపు ఈ విషయంపై భారత బ్యాడ్మింటన్ సంఘం స్పందించింది. సింధుతో పాటు ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ అధికారులతోనూ టచ్‌లో ఉన్నామని తెలిపింది. "మిగతా క్రీడాకారులు ఇప్పటికే గమ్యస్థానానికి చేరుకోగా, సింధు మాత్రం ఈరోజే బయలుదేరారు. ఈ సమస్య త్వరలోనే పరిష్కారమవుతుందని ఆశిస్తున్నాం" అని బాయ్ వర్గాలు తెలిపాయి. అమెరికా, ఇజ్రాయెల్‌లు ఇరాన్‌పై వైమానిక దాడులు చేయడం, ఇరాన్ కూడా ప్రతీకార చర్యలకు దిగుతుండటంతో మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. దీంతో దుబాయ్ మీదుగా ఐరోపా, ఆఫ్రికా వెళ్లే విమానాలకు తీవ్ర ఆటంకం కలిగింది. ఇదిలా ఉంటే.. పురుషుల డబుల్స్ జోడి సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి మాత్రం సురక్షితంగా బర్మింగ్‌హామ్ చేరుకున్నారు. మార్చి 3 నుంచి 8 వరకు ఈ మెగా టోర్నీ జరగనుంది.

### బాణసంచా విషాదం: రూ.20 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటన...

## స్పాట్ లో నలుగురు అధికారులపై చంద్రబాబు వేటు

కాకినాడలో జరిగిన ఘోర బాణసంచా పేలుడు ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో గాయపడి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించిన ఆయన, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సీఎం.. మృతుల కుటుంబాలకు రూ. 20 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా తన వంతుగా రూ. 2 లక్షల సాయం అందించిందని తెలిపారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 20 మంది మృతి చెందారని, మరో 9 మంది పరిస్థితి విషమంగా ఉందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల్లో 12 మంది ఎస్సీలు, 9 మంది మహిళలు ఉన్నారని, వీరంతా కేవలం పూట గడవడం కోసం కూలీ పనులకు వెళ్లిన నిరుపేదలని సీఎం గుర్తుచేసుకున్నారు. ఇలాంటి హృదయ విదారక ఘటనలు పునరావృతం కాకూడదని, అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడేవారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. బాణసంచా కేంద్రాల నిర్వహణలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

*** అధికారులపై అక్కడికక్కడే వేటు**

స్థానిక అధికారుల నిర్లక్ష్యంపై తీవ్రంగా మండిపడ్డ సీఎం చంద్రబాబు.. అక్కడికక్కడే సంచలన నిర్ణయం తీసుకున్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఆర్డీఓ, డీఎస్పీ, డిస్ట్రిక్ట్ లేబర్ ఆఫీసర్, ఫైర్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రెస్ మీట్ ద్వారా ప్రకటించారు. విచారణ ఇంకా కొనసాగుతుందని, ఈ ఘటనకు బాధ్యులైన ఇతర అధికారులపైనా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కేవలం అనుమతులు ఇచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదని, క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే యజమానులపై ఉక్కుపాదం మోపుతామని సీఎం వార్నింగ్ ఇచ్చారు. కొంతమంది విచ్చలవిడితనానికి అలవాటుపడి ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారని, అటువంటి వారిని అరెస్ట్ చేయడమే కాకుండా ప్రాసిక్యూషన్ చేస్తామన్నారు. అంతేకాకుండా వారి ఆస్తులను జప్తు చేసి, ఆ డబ్బును బాధితులకు అందజేస్తామని స్పష్టం చేశారు. పేలుడు పదార్థాలు ఉన్నచోట తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలు పాటించలేదని, కేవలం లాభాపేక్షతో మనుషులను నియమించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆంధ్ర యూనివర్సిటీకి పూర్వవైభవం తీసుకువస్తాం: మంత్రి నారా లోకేశ్

చారిత్రక నేపథ్యం కలిగిన ఆంధ్ర యూనివర్సిటీకి (ఏయూ) పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా కృషి చేస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలను చరిత్రలో నిలిచిపోయేలా, కనీవినీ ఎరుగని రీతిలో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలో ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ (వీసీ) ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి లోకేశ్ విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆంధ్ర యూనివర్సిటీకి దశాబ్దాల ఘన చరిత్ర ఉందని గుర్తుచేశారు. ఈ యూనివర్సిటీని ప్రపంచంలోనే మేటి విద్యాసంస్థగా, 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా తీర్చిదిద్దేందుకు ఈ శతాబ్ది ఉత్సవాలు ఒక వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. మార్చి 26 నుంచి ఏప్రిల్ 26వ తేదీ వరకు నెల రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో పూర్వ విద్యార్థులను (అల్యూమిని) విస్తృతంగా భాగస్వాములను చేయాలని సూచించారు. వారి అనుభవాలు, విజయాలు ప్రస్తుత తరానికి స్ఫూర్తినిచ్చేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో ఏయూ ఘన చరిత్ర ప్రతిబింబించేలా అన్ని చర్యలు తీసుకోవాలని, దీనికోసం నియమించిన వివిధ కమిటీల మధ్య సమన్వయం ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. మీడియా పబ్లిసిటీకి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, ప్రస్తుత విద్యార్థులతో కళలు, సంగీతం, సాహిత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలను వినూత్నంగా రూపొందించాలని చెప్పారు. ఈ ప్రక్రియలో విద్యార్థుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కేవలం యూనివర్సిటీకే పరిమితం కాకుండా, ఉత్తరాంధ్ర ప్రజలను, విద్యార్థులను కూడా ఈ వేడుకల్లో భాగస్వాములను చేయాలని లోకేష్ దిశానిర్దేశం చేశారు. ప్రముఖులతో వివిధ అంశాలపై ప్రత్యేక సదస్సులు నిర్వహించడంతో పాటు, యూనివర్సిటీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాబోయే వందేళ్ల విజన్‌కు తగిన 'యాక్షన్ ప్లాన్'ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో భాగంగా వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ, శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వర్సిటీలో చేపట్టబోయే అభివృద్ధి పనులు, ఏప్రిల్ 26న జరిగే శతాబ్ది స్థాపన దినోత్సవ అజెండాను మంత్రికి వివరించారు. అనుబంధ కళాశాలలను కూడా ఉత్సవాల్లో కలుపుకుని వెళతామని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, యూనివర్సిటీతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ ఉత్సవాల్లో భాగం చేయాలని, దీనిద్వారా విశ్వవిద్యాలయానికి మంచి గుర్తింపు (విజిబిలిటీ) తీసుకురావాలని సూచించారు. శతాబ్ది ఉత్సవాల నిర్వహణ ఒక అద్భుత అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, పీజీవీఆర్ నాయుడు (గణబాబు), విష్ణుకుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మా దేశంలో పాలనను మార్చడం అసాధ్యం: ట్రంప్‌పై ఇరాన్ మంత్రి ఆగ్రహం

తమ దేశంలో పాలనను మార్చడం అసాధ్యమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి అన్నారు. తమకు ఎవరి సాయం అవసరం లేదని, మమ్మల్ని మేం రక్షించుకోగలమని పేర్కొన్నారు. తమ దేశానికి వ్యతిరేకంగా అమెరికా, ఇజ్రాయెల్ సైనిక చర్యలను ప్రారంభించి ఉండవచ్చని, కానీ పాలనను మాత్రం మార్చలేదని అన్నారు. ఉద్రిక్తలను తగ్గించుకోవడం అవసరమని అభిప్రాయపడ్డారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కలిసి తమపై చేస్తున్న యుద్ధం చట్టవిరుద్ధమని విదేశాంగ మంత్రి మండిపడ్డారు. అమెరికా ఫస్ట్ అనే నినాదాన్ని డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్ ఫస్ట్‌గా మార్చారని విమర్శించారు. దురాక్రమణదారులకు తమ సాయుధ బలగాలు సరైన గుణపాఠం చెబుతాయని అన్నారు. ఇదిలా ఉండగా, అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడి నేపథ్యంలో టెహ్రాన్‌ను ఖాళీ చేయాలని ఇరాన్ తమ ప్రజలకు ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు, అమెరికా దాడి నేపథ్యంలో దుబాయ్, అబుదాబీ సహా వివిధ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు చేస్తోంది. 14 అమెరికా స్థావరాలపై చేసిన దాడిలో వందలాది మంది అమెరికా సైనికులు హతమైనట్లు ఇరాన్ ప్రకటించింది. కాగా, ఇరాన్‌పై దాడుల నేపథ్యంలో హర్మోజ్‌గాన్ ప్రావిన్సు మినాబ్ నగరంలో ఒక బాలికల పాఠశాలపై జరిగిన దాడిలో 40 మందికి పైగా మృతి చెందినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఈ దాడిలో మరో 45 మంది గాయపడ్డారు. దాడి సమయంలో పాఠశాలలో 170 మంది విద్యార్థులు ఉండగా, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇరాన్ పారామిలిటరీ ఇస్లామిక్ రెవెల్యూషనరీ గార్డ్ కోర్‌కు ఇక్కడ స్థావరం ఉంది.

## ఇరాన్‌పై దాడి ఎఫెక్ట్: విమానయాన సంస్థలకు కేంద్రం కీలక ఆదేశాలు

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ శనివారం భారీ సైనిక చర్యను ప్రారంభించిన నేపథ్యంలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అప్రమత్తమైంది. పశ్చిమ ఆసియాలో (మిడిల్ ఈస్ట్) నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా, అంతర్జాతీయ సర్వీసులు నడిపే అన్ని భారతీయ విమానయాన సంస్థలకు కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రయాణికుల భద్రతే అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేస్తూ, ఆయా దేశాల ఎయిర్ స్పేస్ అడ్వైజరీలు, నోటీస్ టు ఎయిర్‌మెన్ హెచ్చరికలను నిరంతరం గమనించాలని సూచించింది. మిడిల్ ఈస్ట్ గగనతలంలో ఆంక్షలు అమల్లోకి రావడంతో, అవసరమైన చోట విమానాలను దారి మళ్లించాలని (రీరూటింగ్), గ్లోబల్ సేఫ్టీ ప్రోటోకాల్స్ పాటించాలని ఎయిర్‌లైన్స్‌ను ఆదేశించింది. ఈ మేరకు పౌర విమానయాన శాఖ కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా.. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, డీజీసీఏ, ఎయిర్‌లైన్ ఆపరేటర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు దేశంలోని ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయాలను అలర్ట్ చేశారు. విమానాల దారి మళ్లింపు, అత్యవసర ల్యాండింగ్‌లు జరిగితే ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా గ్రౌండ్ హ్యాండ్లింగ్, ఇమ్మిగ్రేషన్, ఇతర సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలని ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్లకు సూచించారు. విదేశాల్లో ఉన్న భారతీయుల కోసం విదేశాంగ శాఖతో నిరంతరం సమన్వయం చేసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు, విమాన రాకపోకల్లో జాప్యం లేదా మార్పులు ఉంటే వెంటనే ప్రయాణికులకు తెలియజేయాలని విమానయాన సంస్థలను ఆదేశించారు. ప్రయాణికులు కూడా తమ ప్రయాణానికి ముందు ఎయిర్‌లైన్స్‌తో సంప్రదించి, తాజా సమాచారం తెలుసుకోవాలని సూచించారు.

## కాకినాడ జిల్లాలో బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు...

జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సామర్లకోట మండలం వేట్లపాలెం, జి.మేడపాడు గ్రామాల మధ్య గోదావరి కాలువ పక్కన ఉన్న సూర్యశ్రీ ఫైర్‌వర్క్స్ కేంద్రంలో భారీ విస్ఫోటనం సంభవించింది. ఈ ప్రమాదంలో 18 మంది మరణించడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. ప్రమాద తీవ్రత ఊహించని స్థాయిలో ఉంది. పేలుడు ధాటి ఎంత భయానకంగా ఉందంటే.. అక్కడ పనిచేస్తున్న కార్మికుల మృతదేహాలు తునాతునకలై గాల్లోకి ఎగిరి, పక్కనే ఉన్న పొలాల్లో పడ్డాయి. చెల్లాచెదురుగా పడి ఉన్న శరీర భాగాలు చూసి స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. పేలుడు శబ్దం దాదాపు 5 కిలోమీటర్ల వరకు వినిపించిందని, దట్టమైన పొగలు ఆ ప్రాంతాన్ని కమ్మేశాయని స్థానికులు తెలిపారు. ఈ పేలుడు తీవ్రతకు పక్క గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాల స్లాబ్ కూడా పగుళ్లు ఇచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. తీవ్రంగా గాయపడిన మరో 8 మందిని అంబులెన్సుల్లో సమీప ఆసుపత్రులకు తరలించారు. పోలీసులు, ఇతర అధికారులు ఘటనా స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. బాణసంచా తయారీలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, అమాయక ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## దేశవ్యాప్త హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రారంభించిన ప్రధాని మోదీ

సర్వైకల్ క్యాన్సర్‌పై ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్త పోరాటానికి శ్రీకారం చుట్టారు. మహిళల్లో క్యాన్సర్ మరణాలకు ప్రధాన కారణాల్లో ఒకటైన గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నిర్మూలించే లక్ష్యంతో 14 ఏళ్లు పైబడిన బాలికల కోసం రూపొందించిన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని రాజస్థాన్‌లోని అజ్మీర్ నుంచి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని సమక్షంలో పలువురు పాఠశాల విద్యార్థినులకు టీకాలు వేశారు. అనంతరం మోదీ వారితో ముచ్చటించారు. ఈ బృహత్తర కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా లక్షలాది మంది బాలికలకు భవిష్యత్తులో క్యాన్సర్ ముప్పు నుంచి రక్షణ లభిస్తుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. నివారణ ఆరోగ్య సంరక్షణకు తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ఈ కార్యక్రమం నిదర్శనమని పేర్కొంది. రాజస్థాన్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. కిషన్‌గఢ్ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, గవర్నర్ స్వాగతం పలికారు. ఈ పర్యటనలో జైపూర్ బండికుయ్ ఎక్స్‌ప్రెస్‌వే, అమృత్‌సర్‌జామ్‌నగర్ ఎకనామిక్ కారిడార్‌లోని ఓ భాగాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే జోధ్‌పూర్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు నిర్మించనున్న నాలుగు లేన్ల ఎలివేటెడ్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. వీటితో పాటు 'ప్రతి ఇంటికి నీరు' పథకంలో భాగంగా తాగునీటి ప్రాజెక్టులకు, పునరుత్పాదక ఇంధన రంగంలో భాగంగా విద్యుత్ సరఫరా వ్యవస్థ, గ్రిడ్ సబ్‌స్టేషన్లకు కూడా ఆయన శంకుస్థాపనలు చేశారు. రాష్ట్రంలో 'రోజ్‌గార్ ఉత్సవ్' కింద కొత్తగా ఎంపికైన 21,800 మందికి పైగా అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు.

# గీతాంజలి హై స్కూల్‌లో విజ్ఞాన ప్రదర్శన ఘన విజయం

జవహర్ నగర్, ఫిబ్రవరి 28 (భారత్ శక్తి): బాలాజీ నగర్ గీతాంజలి స్కూల్ 2026, నాడు అద్భుతమైన విజ్ఞాన ప్రదర్శన ఘనంగా నిర్వహించబడింది. నర్సరీ నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం సుమారు 115-120 మోడళ్లు ప్రదర్శించబడి అందరి ప్రశంసలు అందుకున్నాయి. ఈ ప్రదర్శన యొక్క ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభ, సృజనాత్మకత మరియు శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించడం. చిన్నారుల నుండి పెద్ద విద్యార్థుల వరకు అందరూ తమ ప్రాజెక్టులను ధైర్యంగా వివరిస్తూ సందర్శకులను ఆకట్టుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, వర్షపు నీటి సంరక్షణ, సౌరశక్తి, కాలుష్య నియంత్రణ, స్మార్ట్ సిటీ, మానవ శరీర నిర్మాణం మరియు ఆధునిక సాంకేతికత వంటి విభిన్న అంశాలపై మోడళ్లు తయారు చేశారు. ప్రతి ప్రదర్శన విద్యార్థుల కృషి, అంకితభావం మరియు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని ప్రతిబింబించింది. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. వారి ప్రోత్సాహం పిల్లల ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు విద్యార్థుల కృషిని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాల్లో ముందుండాలని ప్రేరణనిచ్చారు. ఈ విజ్ఞాన ప్రదర్శన విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది మరియు ఈకార్యక్రమంల డిప్యూటీ మేయర్ రెడ్డి శ్రీనివాస్ గారు కరస్పరెంట్ కృష్ణా సారు ప్రిన్సిపాల్ మేడం కృష్ణవేణి గారు వైస్ ప్రిన్సిపల్ కర్నే సురేందర్ గారు గవర్నమెంట్ టీచర్ చంద్రకళ గారు ఉపాధ్యాయులు మురళి సారు ప్రవీణ్ సారు అజిత్ సారు శారద టీచర్ కుమారి టీచర్ బి జ్యోతి భాగ్యలక్ష్మి టీచర్ తదితరులు పాల్గొన్నారుఎక్జ్యూటివ్ ఏ వరలక్ష్మి గారు టీచర్ వి జ్యోతి గారు పాల్గొన్నారు.









## గీతాంజలి హై స్కూల్ లో విజ్ఞాన ప్రదర్శన

జవహర్ నగర్, ఫిబ్రవరి 28(భారత్ శక్తి): బాలాజీ నగర్ గీతాంజలి హై స్కూల్ ఆధ్వర్యంలో శనివారం విజ్ఞాన ప్రదర్శన ఘనంగా నిర్వహించడం జరిగిందని స్కూల్ ప్రిన్సిపల్ కృష్ణవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సరీ నుండి పదవ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొన్నారు. మొత్తం సుమారు 115 నుంచి 120 రకాల మోడల్స్ ప్రదర్శించబడి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ ప్రదర్శన యొక్క ప్రధాన ఉద్దేశం విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభ, సృజనాత్మకత మరియు శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించడం చిన్నారుల నుండి పెద్ద విద్యార్థుల వరకు అందరూ తమ ప్రాజెక్టులను ధైర్యంగా వివరిస్తూ సందర్శకులను ఆకట్టుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, వర్షపు నీటి సంరక్షణ, సౌర శక్తి, కాలుష్యం నియంత్రణ, స్మార్ట్ సిటీ, మానవ శరీర నిర్మాణం మరియు ఆధునిక సాంకేతిక వంటి విభిన్న అంశాలపై ప్రదర్శన నిర్వహించారు. ప్రతి ప్రదర్శన విద్యార్థుల కృషి, అంకిత భావం మరియు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని ప్రతిబింబించింది. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. వారి ప్రోత్సాహం పిల్లల ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంపొందించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు విద్యార్థుల కృషిని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాల్లో ముందుండాలని ప్రేరేపించారు. ఈ విజ్ఞాన ప్రదర్శన విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రెడ్డి శ్రీనివాస్ కరస్పాండెంట్ కృష్ణ, ప్రిన్సిపల్ కృష్ణవేణి వైస్ ప్రిన్సిపల్ కర్నే సురేందర్, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు చంద్రకళ, ఉపాధ్యాయులు మురళి మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గురుకులాల సొసైటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన విజయేందిర బోయి

హైద్రాబాద్, ఫిబ్రవరి 28(భారత్ శక్తి):తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శిగా నియమితులైన విజయేందిర బోయి శనివారం హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సొసైటీ కార్యదర్శిగా ఉన్నఎస్. కృష్ణ ఆదిత్య నుంచి ఆమె బాధ్యతలను స్వీకరించారు. విజయేందిర బోయి షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కమిషనర్‌గా కూడా సేవలందించనున్నారు. ఆమె అంతకు ముందు మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ గా, మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ గా, రవాణా శాఖలో ప్రత్యేక కార్యదర్శిగా, రోడ్లు, భవనాల శాఖలో ప్రత్యేక కార్యదర్శిగా కీలక పదవులను నిర్వహించారు. విస్తృత పరిపాలనా అనుభవం కలిగిన విజయేందిర బోయి నాయకత్వంలో



రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ సంస్థ విద్యా నాణ్యత, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యార్థుల సమగ్ర వికాసంలో మరింత పురోగతి సాధిస్తుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది విజయేందిర బోయికి స్వాగతం పలికి, ఆమె నాయకత్వంలో సంస్థ మరిన్ని విజయాలను సాధిస్తుందని ఆకాంక్షించారు.

## 4 లక్షల మందికి ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్

*** మంత్రి దామోదర్ రాజనర్సింహ**

నారాయణగూడ, ఫిబ్రవరి 28 (భారత్ శక్తి): మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కాలుష్యం వంటి అనేక కారణాల వల్ల దేశవ్యాప్తంగా క్యాన్సర్ మహమ్మారి విస్తరిస్తోందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. రాష్ట్రంలో ఏటా కొత్తగా 55 నుంచి 60 వేల క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు 'హెచ్‌పీవీ' (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మంత్రి శనివారం హైదరాబాద్ కింగ్‌కోఠి జిల్లా ఆసుపత్రిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ల కార్యక్రమం మూడు నెలల పాటు కొనసాగుతుంది. ఈ వ్యాక్సిన్ తొలి నెల రోజులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో అందుబాటులో ఉంటుంది. తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సరఫరా చేస్తాం. ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.34 వేల ఖర్చయ్యే ఈ వ్యాక్సిన్‌ను రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4 లక్షల మందికి ఉచితంగా ఇవ్వబోతున్నాం" అని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బల్దియా ఖజానాకు గండి..
# అక్రమార్కులకు దండి!

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (భారత శక్తి): సామాన్యుడు చిన్న గది నిర్మించుకుంటే నోటీసులతో విరుచుకుపడే బల్దియా యంత్రాంగం.. వేల చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న వ్యాపార సముదాయాల విషయంలో మాత్రం 'మామూలు'గా వ్యవహరిస్తోంది. కోట్లాది రూపాయల ఆదాయం రావాల్సిన చోట అధికారుల నిర్లక్ష్యం, అంతర్గత అవగాహనతో జీహెచ్ఎంసీ ఖజానాకు భారీగా గండి పడుతోంది. దిల్‌సుఖ్‌నగర్ వంటి ప్రధాన ప్రాంతాల్లో బహిరంగంగానే నిబంధనలు తుంగలో తొక్కుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

| వివరాలు | డోర్ నంబర్: 13-8-36/1 | డోర్ నంబర్: 13-8-36 |
|---|---|---|
| PTIN నంబర్ | 1031301264 | 1031301263 |
| విస్తీర్ణం (Plinth Area) | 4100 చ.అడుగులు | 1633 చ.అడుగులు |
| ప్రస్తుత పన్ను | ₹13,788 | ₹32,380 |

మొత్తం చెల్లిస్తున్న ప్రస్తుత పన్ను: ₹46,168

సాయి రామ్ హాస్పిటల్ వెనుక వైపు భవనం (ఒకే యజమానికి చెందిన రెండు డోర్ నంబర్లు):




### 1. ఒకే యజమాని.. రెండు లెక్కలు!

సాయిరామ్ హాస్పిటల్ వెనుక ఉన్న ఒక భవనానికి సంబంధించి అధికారుల తీరు విస్మయానికి గురి చేస్తోంది. ఒకే యజమానికి చెందిన రెండు డోర్ నంబర్ల (13836/1, 13836) పన్ను మదింపులో నిబంధనల ఉల్లంఘన: ఇక్కడ ఉన్న భారీ టీన్ షెడ్‌ను కనీసం అంచనా వేయకపోవడం, భవనం లో ఎక్కువ భాగం కమర్షియల్ ఉపయోగిస్తున్న ఇంకా రెసిడెన్షియల్ గానే చూపించడం వెనుక అధికారుల హస్తం స్పష్టంగా కనిపిస్తోంది. వాస్తవానికి నిబంధనల ప్రకారం సవరిస్తే, ఇక్కడ పన్ను ₹1.5 లక్షల నుండి ₹2 లక్షల వరకు ఉండాలి. కానీ, కేవలం ₹46,168తోనే సరిపెడుతూ ప్రభుత్వ ఆదాయానికి కోత పెడుతున్నారు.

### 2. పది డోర్ నంబర్లు.. వేల అడుగుల మాయాజాలం!

సాయిబాబా ఆలయ పక్కనే ఉన్న మరో భారీ భవన సముదాయం (డోర్ నెం: 13946/1/NR నుండి 13948/20/NR వరకు) అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇక్కడ సుమారు 10 డోర్ నంబర్లు ఉన్నా, పన్ను చెల్లింపులో మాత్రం భారీ గోల్‌మాల్ జరుగుతోంది.

మాయమైన విస్తీర్ణం: క్షేత్రస్థాయి పరిశీలన ప్రకారం గ్రౌండ్ + 2 అంతస్తుల్లో కలిపి కనీసం 30,000 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంది. కానీ రికార్డుల్లో మాత్రం కేవలం 18,859 చ.అ. మాత్రమే చూపిస్తున్నారు.

లెక్క తేలని 11,141 చ.అ.: అంటే సుమారు 11,141 చదరపు అడుగుల విస్తీర్ణానికి అసలు పన్నే కట్టకుండా ఏళ్ల తరబడి వ్యాపారాలు సాగిస్తున్నారు. దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారిపై ఇంత పెద్ద ఎత్తున అక్రమం జరుగుతున్నా పన్ను విభాగం అధికారులు గుర్తించలేకపోవడం వెనుక 'అంతర్గత ఒప్పందాలు' ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

| | Asmt No. | Owner Name | Door No. | Phone No. | Plinth Area | Yearly Tax |
|---|---|---|---|---|---|---|
| 1 | 1039902921 | Dr. K. Lingaiah | 13-9-46/1/NR | 9849532532 | 1706 | 7233 |
| 2 | 1039902922 | Dr. K. Lingaiah | 13-9-46/2/NR | 9849532532 | 279.86 | 5130 |
| 3 | 1039902923 | Dr. K. Lingaiah | 13-9-46/9 TO 12/NR | 7013348480 | 1328 | 46470 |
| 4 | 1039902924 | Dr. K. Lingaiah | 13-9-46/6/NR | 9849532532 | 431 | 9236 |
| 5 | 1039902926 | Dr. K. Lingaiah | 13-9-46/7/NR | 9849532532 | 2278 | 17241 |
| 6 | 1039902927 | Dr. K. Lingaiah | 13-9-46/8/NR | 9849532532 | 86 | 9720 |
| 7 | 1039902928 | Dr. K. Lingaiah | 13-9-46/3 TO 5/NR | 9246213536 | 868 | 17565 |
| 8 | 1039902929 | DR. GIRIJA KUMARI | 13-9-46/13 TO 18/NR | 9849532532 | 2187 | 72708 |
| 9 | 1039902930 | K. Shravanthi | 13-9-46/19/NR | 9849532532 | 4343 | 159572 |
| 10 | 1039902931 | K. Shravani | 13-9-46/20/NR | 9849532532 | 5353 | 177950 |
| | | | | | 18859.86 | 522825 |







దిల్సుఖ్నగర్ సాయిబాబా గుడి ప్రక్కన కమర్షియల్ భవనం

### 3. అధికార దుర్వినియోగం - వ్యవస్థకు చేటు

దిల్‌సుఖ్‌నగర్‌లోని లోటస్ లాప్ స్కూల్ ఎదురుగా ఉన్న భవనం (PTIN: 1031301113, 1039909688) ప్రభుత్వ అధికారుల అవినీతికి నిలువుటద్దంగా నిలుస్తోంది. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఏ.ఎం.సి (AMC) గారు తన స్నేహితుల భవనం అనే ఉద్దేశంతో, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం గమనార్హం.

**ముఖ్యమైన అక్రమాలు:**

విస్తీర్ణంలో మోసం: దాదాపు 2000 చదరపు అడుగులకు పైగా విస్తీర్ణాన్ని లెక్కల్లో చూపకుండా పన్ను ఎగవేతకు సహకరించడం.

తప్పుడు అనుమతులు: నివాస గృహంగా (Residential) అనుమతి మరియు ఓ.సి (OC) పొంది, యథేచ్ఛగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడం.

అధికార పక్షపాతం: ఒక పూర్తి అంతస్థును రికార్డుల నుండి తొలగించి, పెనాల్టీలను తగ్గించి ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి కొట్టడం.

సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన అధికారులే ఇలాంటి అక్రమాలకు పాల్పడటం వల్ల నిజాయితీగా పన్ను చెల్లించే పౌరులు నష్టపోతున్నారు. వ్యవస్థలో పేరుకుపోయిన ఇటువంటి అవినీతిపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విచారణ జరపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**పేదలపై ప్రతాపం.. పెద్దలకు ఆశీస్సులు!**

మధ్యతరగతి ఇళ్లకు వెళ్లి రూపాయి వదలకుండా వసూలు చేసే అధికారులు, ఇంతింత పెద్ద వ్యాపార సముదాయాల వద్దకు వచ్చేసరికి గుడ్డివారిగా నటిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ 'వసూల్ రాజా'ల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారుల అండదండలు లేకుండా ఇంత పెద్ద ఎత్తున పన్ను ఎగవేత సాధ్యం కాదని గుసగుసలు వినిపిస్తున్నాయి. బల్దియా ఖజానాకు చిల్లు పెడుతున్న ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, ఎగవేసిన పన్నును వడ్డీతో సహా వసూలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published & Printed at Sri Muktheswara Publications, D.No.5-25-53/1,3/12, Brodipet, Guntur-522002. Andha Pradesh. Fax: 040-24054446 Cell:9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2007/22515, Editor: Kesaram Penta Reddy